
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002



# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 12.05.2026 | సంపుటి : 12 సంచిక : 292 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





## విద్యావ్యవస్థలో తెలంగాణకు
# తీవ్రవివక్ష

ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారు. వేర్వేరు రెసిడెన్షియల్స్ వల్ల కులవివక్ష పెరుగుతుందని మేం గ్రహిం చాం. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 9 వస్తువులతో కూడిన విద్యా కిట్‌ను అందివ్వనున్నాం. విద్యార్థులకు ఇచ్చే ఎడ్యుకేషన్ కిట్ కోసం రూ.1100 కోట్లు కేటాయించాం. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అందుకే 69 ఉద్యమం మొదలైంది**

బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యనందించడమే మా సర్కారు లక్ష్యం

విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలం

అందుకే ఈ శాఖను నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నా: సీఎం రేవంత్ రెడ్డి


ఎల్‌బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు అజారుద్దీన్, వివేక్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

- తెలంగాణను నీతిఆయోగ్ అభినందించింది
- టెన్ ప్లస్ టూ విధానం లేకపోడం వల్లే పది తర్వాత
- డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయి
- కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ఎల్‌బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను
- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ రంగంలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైందని తెలపారు. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, అప్పటి నుంచి దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించామని, ఉత్తమ విద్యా ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించుకోగలుగుతామని మిగతా 2లో..

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

**సభ్యురాళ్లుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేత**



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా మిగతా 2లో..




## తర్వలో మూడో దశ 'సర్'

- 17 రాష్ట్రాలు, 5 యూటీల్లో నిర్వహణ
- ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ఎన్నికల సంఘం మూడోదశ ఓటర్ల సమగ్ర సవరణకు సిద్ధమైంది. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ 22 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'రాబోయే రోజుల్లో' ఓటర్ల జాబితా వడపోత కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు సోమవారం వెల్లడించారు. ఐదు అసెంబ్లీలకు ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోగా.. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మూడో దశకు సమాయత్తమ వుతోంది. ఇప్పటివరకు ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, మిగతా 2లో..

## అభివృద్ధిలో కేంద్రంతో కలిసిపనిచేస్తాం

**అధికారిక కార్యక్రమంలో రాజకీయాలకు తావులేదు**

- తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని కోరాం
- రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం • బీజేపీని ఓడించి సీఎం అయిన వ్యక్తిని నేను
- బీజేపీ అంటే..బ్రిటిష్ జనతా పార్టీ • విభజించు పాలించడం ఆ పార్టీ రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం • జెమిని సర్కస్‌లా బీజేపీ ఎన్నికల విధానం
- మోడీ విధానాలతో దేశానికి నష్టం • మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

వార్త 2 లో

## బండి భగీరథ్ కేసులో తక్షణ చర్యలకు సీఎం ఆదేశం

- 8న ఫిర్యాదు వస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- డీజీపీని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి
- సిట్ ఏర్పాటు చేస్తూ సీవీ ఆనంద్ ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో మిగతా 2లో..

## బండి భగీరథ్ కేసుతో భాజపాకు సంబంధం లేదు

- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- కేసులో బండి కుటుంబికుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలి: రామచందర్‌రావు

2లో..

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**

## ఇక వారానికి 48 గంటలే పని

- ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపు
- కొత్త లేబర్ కోడ్‌లపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్
- కనీస వేతనం లెక్కింపు సూత్రం తొలగింపు
- ఫ్లోర్ వేజ్‌ను ఇంకా ఖరారు చేయని కేంద్రం




న్యూఢిల్లీ(జనంసాక్షి):కార్మిక, ఉద్యోగ వర్గాలకు శుభవార్త. వారానికి 48 గంటల పని పరిమితి, తప్పనిసరిగా వారానికొక విశ్రాంతి దినం, ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది. దీంతో గతంలో నాలుగు కార్మిక కోడ్‌లలో చేసిన ఈ ప్రతిపాదనలు అధికారిక హోదాను పొందాయి. దేశవ్యాప్తంగా కంపెనీలు వీటిని ఇక కచ్చితంగా పాటించాల్సిందే. వాస్తవానికి నాలుగు కార్మిక కోడ్‌లు 2025 నవంబరు 21 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే మే 8, 9 తేదీల్లో వాటికి సంబంధించిన తుది నిబంధనలు, నియమాలతో కేంద్ర ప్రభుత్వం దాదాపు 30 అధికారిక గెజిట్‌లను ప్రచురించింది. దీంతో ఈ కార్మిక సంస్కరణల ప్రక్రియ పూర్తయింది.కేంద్ర సర్కారు తాజాగా ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్లలోని అత్యంత కీలకమైన అంశం కార్మికుల కనీస వేతనం. కేంద్రం తొలుత విడుదల చేసిన మిగతా 9లో..



## కార్మికులు సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వారికి మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ పమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాలుగా మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో వేతనాల సవరణ శాస్త్రీయంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాల విధానాలను కమిటీ కూలంకషంగా పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురానున్న నూతన 'లేబర్ కోడ్' అంశాల ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు.కార్మికుల వేతనాలను కేవలం అంకెల్లో కాకుండా, వారి వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు ఉండాలని కేబినెట్ స్ కమిటీ నిర్ణయించింది. దేశంలోని అత్యుత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం ధృఢ సంతకల్పంతో మిగతా 2లో..

## మోడీది జవాబుదారీతనం లేని ప్రసంగం



- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని మిగతా 2లో..

**పెట్రోల్, బంగారంపై మోడీ వ్యాఖ్యలు..**

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు

- వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ పెట్రోల్ వాడకం తగ్గించాలనడం హాస్యాస్పదం
- అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు? • మంత్రి పొన్నం విమర్శ

2లో..



## డీఎంకే నాయకుడు స్టాలిన్ ఇంటికెళ్లిన విజయ్

**తమిళనాట సరికొత్త సంప్రదాయం**

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు కొత్త సీఎం విజయ్ – మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమ వారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయ నిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే మిగతా 9లో..

**స్వల్ప తేడాతో ఓడిపోతే ఎన్నిక ఫలితంపై**

## తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చు

పలు నియోజకవర్గాల్లో ఫలితాలపై టీఎంసీ పిటిషన్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంలో టీఎంసీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'సర్' వల్ల ఫలితాలు తారుమారయ్యాయని టీఎంసీ వాదనలు వినిపించింది. పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిపోయామంది. 'సర్'లో తొలగించిన ఓట్ల పునరుద్ధరణ కోసం వేలల్లో అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. మిగతా 9లో..

## టోల్ ఫీజు కడితేనే హర్మూజ్‌లోకి ఎంట్రీ

**భారత్‌కు మాత్రం మినహాయింపు**

**జలసంధి గుండా నౌకల రవాణాపై ఇరాన్ కొత్త నిబంధనలు**

**అమెరికాకు మద్దతిచ్చే దేశాల నౌకలకు నో ఎంట్రీ**

టెహ్రాన్(జనంసాక్షి):ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం రవాణా జరిగే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఇప్పుడు పూర్తి స్థాయి నియంత్రణను సాధించింది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి ఈ మార్గంలో నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్, ఇప్పుడు ఏకంగా టోల్ ఫీజు వసూలు చేసేందుకు అధికారికంగా కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే దేశాలకు తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తోంది. అసలు ఇరాన్ కొత్త రూల్స్ ఏంటి? ఏయే దేశాలకు అనుమతి లభిస్తోంది? ఈ కథనంలో చూద్దాం.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. షిప్పింగ్ ఇండస్ట్రీ జర్నల్ లాయిడ్స్ లిస్ట్ కథనం ప్రకారం హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల కోసం ఇరాన్



పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ అథారిటీ పేరిట ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ మార్గంలో మిగతా 2లో..

## ఎవరూ టోల్ ఫీజు చెల్లించొద్దు

**ట్రంప్ ప్రభుత్వం కొత్త ఆంక్షలు**

2లో..

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

- రాష్ట్ర రాజధాని నుంచి వార్డు స్థాయి వరకు పార్టీ జెండాలు ఆవిష్కరించాలి
- పార్టీ శ్రేణులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ల నియామకం

నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర

## వీబీ జీ రామ్ జీ జులై 1నుంచి..

కేంద్ర ప్రభుత్వం ప్రకటన



## బంగ్లాదేశ్‌తో సరిహద్దుల్లో కంచె..

బీఎస్ఎఫ్‌కు భూమి కేటాయింపు • మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

వివరాలు 2వ పేజీలో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12.05.2026

## టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా మద్దతు

**సాంకేతిక దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

హైదరాబాద్(జనంసాక్షి): జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం తెలిపారు.'ప్రగతికి దారి చూపుతూ, భవిష్యత్తు తరాలకు ప్రేరణనిస్తున్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు, ఆవిష్కర్తలందరికీ 'జాతీయ సాంకేతిక దినోత్సవం' సందర్భంగా శుభాకాంక్షలు. సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, భవిష్యత్ సవాళ్లను అధిగమించడం కోసం టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతునిస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని భారత టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు' సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

### త్వరలో మూడో దశ 'సర్'

పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బిహార్‌లో సరను చేపట్టారు. త్వరలోనే ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించి వడపోత ప్రక్రియ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. మిగిలిన 40 కోట్ల ఓటర్లకు సంబంధించి 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోదశ సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు.వాస్తవానికి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 19నే లేఖ రాసింది. ఏప్రిల్‌లో ఈ ప్రక్రియ ఉంటుందని, అందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించింది. అయితే, వివిధ కారణాల రీత్యా షెడ్యూల్‌లో ఆటంకం ఏర్పడింది. బిహార్‌లో ఓటర్ల సమగ్ర సవరణ చేపట్టడంపై ఆయా పార్టీలు సుప్రీంకోర్టు తలుపుతట్టడం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం వంటి కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యం అయ్యింది.

## కార్మికులు సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

ఉందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ పడింది. తెలంగాణను కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయడ్డారు. త్వరలోనే అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి, కార్మికులకు మేలు చేకూర్చే విధంగా కనీస వేతనాల సవరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## మోడీది జవాబుదారీదనం లేని ప్రసంగం

వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు



హైదరాబాద్(జనంసాక్షి): ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

**తెలంగాణ ప్రభుత్వము**
**రోడ్లు & భవనాల శాఖ కార్యాలయము**

ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదాద్రి భువనగిరిలో ఆర్&బి డివిజన్‌లో ఈ-ప్రొక్యూర్‌మెంట్ కింద రెండు ఆర్ఎస్ఐ పనులు, నాలుగు భవన మరమ్మతుల పనులు విలువ అంచనా రూ.44.20లక్షలు చేయుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరుచున్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా యాదాద్రి భువనగిరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆర్&బి), డివిజన్, యాదాద్రి భువనగరిజిల్లా యాదాద్రి భువనగరి నిట్ నం. డీబీ/బీఎన్‌జీ/2/2026-27/1 తేది: 08.05.2026. టెండరు దారులు టెండరు షెడ్యూల్‌లను ఈ -మార్కెట్‌ప్లేస్‌నుంచి అనగా **tender.telangana.gov.in** నుండి తేది: 12.05.2026 ఉదయం 11 గం॥ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.టెండర్లు స్వీకరించు చివరితేది: 25.05.2026 సాయంత్రం 3.30గం॥లకు.మిగతావివరాలు ఈ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా **tender.telangana.gov.in**

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, ఆర్&బి,**
**డివిజన్ : యాద్రాద్రి భువనగిరి, యాద్రాద్రి భువనగిరి జిల్లా**

DIPR No.2247-PP/CL/ADVT/2026-27

# విద్యావ్యవస్థలో తెలంగాణకు తీవ్ర వివక్ష



వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ల పోస్టులను భర్తీ చేసిందన్న సీఎం 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి, నియామకపత్రాలు అందించామని తెలిపారు. 20 ఏళ్లపాటు ప్రభుత్వ టీచర్లకు పదోన్నతులు ఉండలేదని ఆరోపించారు. వివాదాలకు తావులేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేశామని అన్నారు. 4 అంశాల్లో తెలంగాణను నీతిఆయోగ్ అభినందించిందని గుర్తు చేశారు. 27 వేల పాఠశాలల్లో 19 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్నారని. రాష్ట్రంలో విద్యార్థులు, టీచర్ నిష్పత్తి 17:1 గా ఉందని అన్నారు.ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలని సీఎం తెలిపారు. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలని కోరారు. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని టీచర్లను పంపిస్తున్నామని, ఇప్పటికే కొంతమంది టీచర్లు ఫిన్లాండ్‌లో అధ్యయనం చేసి వచ్చారని పేర్కొన్నారు. విద్యతో పాటు పిల్లలను సాంకేతిక నైపుణ్యాలు, క్రీడల్లో తీర్చిదిద్దాలని, విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని వెల్లడించారు. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని, టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్ల పది తర్వాత డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బలవర్థకమైన పోషకాహారం పెట్టాలని నిర్ణయించామని, మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించామని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొన్ని స్కూళ్లల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని రేవంత్ రెడ్డి తెలిపారు. 16 ఏళ్లుగా హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోతే ఈ ప్రభుత్వం పెంచిందని, 10 ఏళ్ల తర్వాత ఈ ప్రభుత్వమే విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచిందని గుర్తు చేశారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని, వేర్వేరు రెసిడెన్షియల్స్ వల్ల కులవివక్ష పెరుగుతుందని తాము గ్రహించామని తెలిపారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని, ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఒక్కో సమస్యను క్రమంగా పరిష్కరిస్తామని, ఒక టీచర్ సరిగా పనిచేయకపోతే విద్యార్థి జీవితంతో పాటు సమాజం చెడిపోతుందని పేర్కొన్నారు. క్యూర్ ప్రాంతంలో పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన పలు కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. ఎల్?బి స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేకే, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, వర్సిటీల వీసీలు హాజరయ్యారు. విద్యా వారోత్సవాల్లో పాల్గొనేందుకు పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలి వచ్చారు.

## అభివృద్ధిలో కేంద్రంతో కలిసిపనిచేస్తాం

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్దాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్దాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్దాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు.

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర**

హైదరాబాద్(జనంసాక్షి): ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు.ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి.

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి వార్డులో పార్టీ జెండాలు ఎగురవేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయం లో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను నేడు మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఉద్యమిద్దాం తెలంగాణ ఏర్పడి పన్నెండున్నరేళ్లు గడిచిన సరే ఇంకా వలస పాలన నాటి దుష్పరిణామాలే ఇప్పటికీ కనిపిస్తున్నాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చుకుంటే బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం కూడా ఇప్పుడు తీవ్ర నిస్పృహలో ఉందని విచారం వ్యక్తం చేశారు.

## టోల్ ఫీజు కడితేనే హర్మూజ్‌లోకి ఎంట్రీ

వెళ్లాలనుకునే ప్రతి నౌకా ముందుగా అనుమతి తీసుకోవడంతో పాటు, టోల్ ఫీజు చెల్లించడం తప్పనిసరి. దీని కోసం వెసెల్ ఇన్ఫర్మేషన్ డిక్లరేషన్ పేరుతో ఒక ఫామ్‌ను విడుదల చేసింది. ఇందులో దాదాపు 40కి పైగా ప్రశ్నలు ఉన్నాయి. నౌక పేరు, గుర్తింపు నంబర్, నౌక యజమాని, ఇన్సూరెన్స్ వివరాలు, ఏ దేశం నుంచి వస్తోంది? ఎక్కడికి వెళ్తోంది? నౌకలో ఉన్న సిబ్బంది, సరకు వివరాలు ఇలా ప్రతి చిన్న విషయాన్ని పక్కాగా మెయిల్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటిని పరిశీలించిన తర్వాత నౌకలకు తదుపరి సూచనలు ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు. అయితే, తప్పుడు సమాచారం ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఈ టోల్ ఫీజు ద్వారా వచ్చిన తొలి ఆదాయాన్ని కూడా ఇరాన్ ఇప్పటికే అందుకున్నట్లు ఆ దేశ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ గత నెలలోనే ప్రకటించారు. కొన్ని నౌకలు రవాణా అనుమతి కోసం 2 మిలియన్? డాలర్ల వరకు చెల్లించినట్లు షిప్పింగ్ ఇండస్ట్రీ జర్నల్ లాయిడ్స్ లిస్ట్ కథనం పేర్కొంది.

అమెరికాకు మద్దతిచ్చే దేశాల నౌకలకు నో ఎంట్రీ

అయితే హర్మూజ్ జలసంధిలో కొన్ని దేశాలకు ప్రవేశం లేదు. ఎవరిని అనుమతించాలి, ఎవరిని అడ్డుకోవాలి అనేది పూర్తిగా ఇరాన్ నిర్ణయమే. ముఖ్యంగా తమ దేశంపై ఆంక్షలు విధిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే దేశాల నౌకలను ఏమాత్రం అనుమతించే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికాకు మద్దతు ఇస్తే హర్మూజ్ జలసంధి తలుపులు మీ కోసం శాశ్వతంగా మూసుకుపోతాయని బహ్రెయిన్‌కు వార్నింగ్ ఇచ్చింది. ఇదే సమయంలో భారత్‌కు ఒక ఊరట లభించింది. ఇరాన్‌తో జరిపిన ప్రత్యేక చర్చల ఫలితంగా భారత్, పాకిస్థాన్ జెండాలు ఉన్న నౌకలకు మాత్రం హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## ఎవరూ టోల్ ఫీజు చెల్లించొద్దు

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ ఆంక్షల వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు మండిపోతున్నాయి. ఇది చరిత్రలోనే అతిపెద్ద చమురు సరఫరా షాక్‌గా నిపుణులు చెబుతున్నారు. ఈ చర్యలను అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇరాన్ అధికారులకు ఎవరూ టోల్ ఫీజు చెల్లించవద్దంటూ ట్రంప్ ప్రభుత్వం కొత్త ఆంక్షలు విధించింది. అంతేకాదు, ఇరాన్ పోర్టులను సైతం అమెరికా బ్లాక్ చేస్తోంది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### వీబీ జీ రామ్ జీ జులై 1నుంచి...

న్యూఢిల్లీ(జనంసాక్షి):'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్'ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ కొత్త చట్టాన్ని జులై 1నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ ఇస్తుందని తెలిపింది.జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపింది

# బండి భగీరథ్ కేసులో తక్షణ చర్యలకు సీఎం ఆదేశం

పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబం ధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసు లు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టప రమైన పక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

## బండి భగీరథ్ కేసుతో భాజపాకు సంబంధం లేదు

హైదరాబాద్(జనంసాక్షి): బండి తనయుడు భగీరథ్‌పై నమోదైన కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అది బండి సంజయ్ కుటుంబంలో జరిగిన అంశమని.. భాజపాలో కాదన్నారు. సోమ వారం మీడియాతో ఆయన మాట్లాడారు. బండి భగీరథ్ కేసుతో భాజపాకు సంబంధం లేదని చెప్పారు. ఈ కేసులో సంజయ్ కుటుంబీకుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్నారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**

హైదరాబాద్(జనంసాక్షి):కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. డీజీపీ స్థాయి మహిళా అధికారి సమక్షంలో మెజిస్ట్రేట్ ఎదుట బాధిత అమ్మాయి, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ను రికార్డు చేయాలని, బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. బండి భగీరథపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులను వేధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బాధితురాలికి సరైన న్యాయం చేయడమే కాకుండా.. వారి కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ను కాపాడాలని చూస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలం సృష్టిస్తున్న కేసుపై కాంగ్రెస్ నాయకులు, మహిళా మంత్రులు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వెంటనే అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోమ్ శాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డి కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని, రేవంత్ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. మైనర్ బాలిక అని తెలిసి కూడా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడని తెలిపారు. బీజేపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన భగీరథ్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. హైదరాబాద్ చిలుకానగర్‌లో బండారి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, రేవంత్ రెడ్డి కుమ్మక్కై డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి కుమారుడిని కాపాడేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోక్సో కేసులో బండి సంజయ్‌కు సహకరిస్తుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనా అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ బేటీ బచావో కేవలం నినాదానికే పరిమితమా అని నిలదీశారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ్‌తో సరిహద్దుల్లో కంచె..

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు.ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

**బెంగాల్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**

బెంగాల్ లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

# చెరువుల చెంత హైడ్రా సీసీ టీవీ నిఘా

- ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు
- 900ల కెమెరాలను అమర్చి నిరంతర పర్యవేక్షణ



**హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) :** చెరువుల పరిరక్షణకు హైడ్రా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మట్టితో నింపి కబ్జా చేయాలనే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. చెరువుల చెంత సీసీటీవీ కెమేరాలు పెట్టి గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వీటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానించింది. నిరంతరం చెరువుల చెంత ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవస్థను హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించేలా ఏర్పాటు చేసింది. సీసీటీవీ కెమేరా నిఘా వ్యవస్థను సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు. చెరువులలో మట్టి పోయకుం డా.. ఆక్రమణలు జరగకుండా ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు పర్యవేక్షిస్తు న్నాయి. వీటికి తోడు సీసీటీవీ కెమేరా వ్యవస్థ అదనంగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా.. మట్టితో నింపేందుకు ప్రయత్నించినా..కబ్జాలు చేసినా సీసీటీవీ కెమేరాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రాకు లభించింది. హైడ్రా కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం నుంచి మోనిటర్లద్వారా నిరంతరం పరిశీలిస్తారు. మట్టిని తెచ్చి పోసిన పక్షంలో ఆ వాహనం వివరాలను తెలుసుకోవడంతో పాటు.. అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను కూడా అప్రమత్తం చేస్తారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మోనిటర్లకు కూడా చెరువుల చెంత హైడ్రా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమేరాలను అనుసంధానం చేశారు. దీంతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్ గారు కూడా సీసీటీవీ వ్యవస్థను ప్రారంభించిన వారిలో ఉన్నారు.

# బండి సంజయ్ మేక వన్నె పులి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హిందూత్వం ముసుగులో సనాతన ధర్మాన్ని అడ్డుపెట్టుకొని రౌడీయిజం, గూండాయిజం, దాడులు మానభంగాలు చేస్తున్న బండి కుటుంబ సభ్యుల ఆగడాలను బిజెపిలోని రాష్ట్ర పెద్దలు కేంద్ర నాయకులు గమనించి వెంటనే బండి సంజయ్‌పై పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని ఉపేంద్ర డిమాండ్ చేశారు. భారత్ మాతాకీ జై అంటూ కన్న కొడుకుతో మైనర్ బాలికలపై అత్యాచారానికి ప్రోత్సహిస్తున్న ఇటువంటి దుర్మార్గ రాజకీయ నాయకులను సమాజం నుండి వెలివేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో బండి కొడుకు విద్యార్థులపై ర్యాగింగ్ చేయడమే కాకుండా భౌతిక దాడులు చేసి వారిని బెదిరించి తల్లిదండ్రులను బెదిరించి తప్పుడు కేసులు పెట్టిస్తానని బ్లాక్ మెయిల్ చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ కన్న తండ్రిగా అతనిని కంట్రోల్ చేయకుండా పిల్లలు గొడవ పడటం మామూలే అని మాట్లాడి కొడుకును సపోర్ట్ చేయడం వల్లనే ఈరోజు అనేకమంది విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడటమే కాకుండా వారిని ఫిజికల్ గా వాడుకొని వారిని వాళ్ల తల్లిదండ్రులని బెదిరిస్తూ వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్న భగీరథను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్రావు మాట్లాడుతూ కొడుకు చేసిన తప్పుకు తండ్రికి సంబంధం లేదు అనడం చాలా దుర్మార్గమని, గతంలో కొడుకు చేసిన తప్పులు తండ్రి దృష్టికి వచ్చినప్పుడు సవరించి ఉంటే బండి సంజయ్ కి ఇలాంటి దౌర్భాగ్యమైన పరిస్థితి వచ్చేది కాదన్నారు. సనాతన ధర్మంలో కుటుంబ వ్యవస్థకు చాలా విలువలు ఉన్నాయని, సనాతన ధర్మంలో మహిళలకు గౌరవ స్థానం ఉన్నదని, దాని వారసులమని చెబుతూనే వీరు ఆ సనాతన ధర్మానికి వెన్నుపోటు పొడుస్తున్న ఈ కుహనా సనాతన వాదులను హిందూ వాదులు తరిమికొట్టాలని, ఇలాంటి వారికి పుట్టగతులు లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. బండి సంజయ్‌ను బిజేపి నుండి సస్పెండ్ చేయాలని, కేంద్ర మంత్రి పదవి నుండి బర్త్ రఫ్ చేయాలని, నిందితుడు బండి సంజయ్ కొడుకు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని, బాధితురాలు కి మరియు కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించాలని, పోలీసు వారు రిజిస్టర్ చేసిన ఫోక్సో యాక్ట్ సెక్షన్ 11ను ఆల్టర్ చేసి సెక్షన్ 5, సెక్షన్ ఏడు కింద రిజిస్టర్ చేసి నిందితుని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

- అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు?
- ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) :** ప్రధాన మంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వా ల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు.

# బండి సంజయ్ కొడుకును వెంటనే అరెస్ట్ చెయ్యాలి

**ఎన్నారై బీఆర్ఎస్ యూకే యువజన విభాగం నాయకురాలు అమరేశ్వరి**




**లండన్ (జనంసాక్షి) :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎన్నారై బీఆర్ఎస్ యూకే యువజన విభాగం నాయకురాలు అమరేశ్వరి తెలిపారు. లైంగిక దాడి యత్నం చేయడమే కాకుండా, ఇటీవల బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడినప్పుడు వారు తెలియజేసిన వివరాలు ఒళ్లు గగుర్పొడిచేలాగా ఉన్నాయని, సభ్య సమాజం తల దించుకొనేలా ఉన్నాయని, చాలా బాధ కలిగిందని తెలిపారు. ఈ ఘటనలో బండి సాయి భగీరథ్‌పై హైదరాబాద్ నగరంలోని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) కేసు నమోదయినప్పటికీ, అరెస్ట్ చెయ్యకపోవడం అత్యంత దారుణమని, వెంటనే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు మీడియా ద్వారా అందిన సమాచారం మేరకు, బండి సంజయ్ బాధిత కుటుంబాన్ని బెదిరించాడని, అలాగే పోలీసులు కూడా తమ విధులని సక్రమంగా నిర్వహించలేదనేది స్పష్టం అవుతుందని, కాబట్టి నిష్పక్షపాత విచారణ జరిపి బండి సంజయ్ తో పాటు పోలీసుల పై కూడా కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుందని అన్నారు. ఇంకా ప్రభుత్వం బండి సంజయ్ కి కొమ్ము కాస్తూ కాపాడాలనే ప్రయత్నం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని, ఎన్నారై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనిల్ కూర్మాచలం, నవీన్ రెడ్డి, అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి, మహిళా కమీషన్లకు, ఇతర బాధ్యతగా సంఘాలకు లేఖలు రాస్తామని అమరేశ్వరి హెచ్చరించారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విద్యా, వైద్యం, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- టెన్త్, ఇంటర్ లో ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేత
- హాజరైన ఎంపీ కావ్య, కలెక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ వెంకటరామిరెడ్డి , డీఈవో రంగయ్య నాయుడు



**వరంగల్ బ్యూరో, మే 11 (జనం సాక్షి) :** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారని రాష్ట్ర ఆటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం యంగ్ అచీవర్ సన్మాన కార్యక్రమమాన్ని ఉర్సుగుట్ట లోని ఆకుతోట ఫంక్షన్ హాల్ లో సోమవారం ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ 2025-26 విద్యా సంవత్సర టాపర్లకు,అలాగే ఎదుగుతున్న చెస్ ఛాంపియన్ మరియు రెండు సార్లు ప్రపంచ రికార్డు సాధించిన చిరంజీవి మాస్టర్ కొండ శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్‌కు ఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి పాల్గొని పదవ తరగతిలో ఫలితాలలో 550 అంటే ఎక్కువ వచ్చిన 103 మరియు ఇంటర్మీడియట్ లో 980 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన 14 మంది విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్ మెమెంటో శాలువాలతో మంత్రి సన్మానించారు. అలాగే అతి చిన్న వయస్సులోనే రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన చెస్ చాంపియన్ చిరంజీవి మాస్టర్ కొండ శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్ కు మంత్రి చే ట్రోఫీ,చెస్ బోర్డు తో పాటు యువరాజ్ కిరీటంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాడుతూ ఆడపిల్లలకి చదువెందుకు అనే మాట నుండి ఆడపిల్లలే ర్యాంక్ సాధించటంలో ముం దుండే పరిస్థితిని మనం చూస్తున్నాం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ , రెండు జతల యూనిఫాం ఇవ్వడంతో పాటు కామన్ మెనూ, డైట్ ఛార్జీలపెంపు తో పాటు నాణ్యమైన విద్య అందించడం తో పాటు మిడ్ డే మిల్స్ ద్వారా పౌష్టిక ఆహారం అందించేందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్య మంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్య మంత్రి వర్యులు దృష్టి సారించి ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లాలో బాలికలదే అత్యధిక ఉత్తీర్ణత చూస్తుంటే అందుకు కారణం జిల్లా కలెక్టర్ కృషి, స్ఫూర్తి మోటివేషనల్ క్లాసుల ఏర్పాటు, కంప్లైంట్ బాక్స్ లా ఏర్పాటులో పిల్లల్లో ఆత్మవిశ్వాసం తో పాటు స్కూల్ హెడ్మాస్టర్ల కృషి ఫలితంగా ఈ రోజు యంగ్ అచీవర్ సన్మాన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రిగ పేర్కొన్నారు.

చిరంజీవి మాస్టర్ కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్ గురించి మాట్లాడుతూ 45 రోజుల ట్రైనింగ్ లో భాగంగా 92 సెగ్మెంట్స్ 21 బోర్డ్స్ తో రికార్డ్ సృష్టించిన ఎమర్జింగ్ చెస్ చాంపియన్ చిరంజీవి మాస్టర్ కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్ అభినందించారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ కడియం కావ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కలలు కనండి.. ఆ కలలు నిజమయ్యే లా అహర్నిశలు కష్ట పడాలన్నారు.మనపై మనకు నమ్మకం ఉన్నప్పుడే లక్ష్యాలు సాధ్యం చేయగలమని వారు అన్నారు.విద్యార్థులు ఎప్పుడూ పాజిటివ్ థింకింగ్ తో ముందుకు సాగాలని ,సోషల్ మీడియాకు దూరంగా ఉంటేనే ఫోకస్ పెరుగుతుందన్నారు. శ్రీయాంశ్ భవిష్యత్తులో వరంగల్ కు మరింత పేరు తీసుకురావాలి అన్నారు.పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నై నా చేరుకోవచ్చు అన్నారు. అతి చిన్న వయసులోనే ఎమర్జింగ్ చెస్ చాంపియన్ షిప్ లో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్‌ను ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు. కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ప్రతిభతో ముందుకు సాగుతున్నారని వారికి ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తాను పదివేల చొప్పున పారితోషకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో 550, ఇంటర్మీడియట్లో 980 మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులతో పాటు లిటిల్ ఛాంపియన్ కొండా శ్రీయాంశ్ మురళి కృష్ణ పటేల్ సాధించి ఘనత పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్డీఓ ఉమా, వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు, ఇక్బాల్ ,శ్రీకాంత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, భాగ్యలక్ష్మి పుష్పలత, రమేష్, నారాయణ రెడ్డి, డివైస్ ఓ అనిల్, అధికారులు పాల్గొని చిన్నారులను మెడల్స్, మెమెంటో శాలువాలతో సన్మానించి ఆశీర్వదించారు.

# ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

- కొత్త సిఎం విజయ్‌కు స్టాలిన్ హెచ్చరిక

**చెన్నై, మే11 (జనంసాక్షి) :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేసి 24 గంటలు గడవకముందే ప్రతిపక్షాలు ఆయనపై విమర్శలకు దిగాయి. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే.స్టాలిన్ విజయ్ ప్రసంగాన్ని తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక పనితీరును విమర్శించడంపై సీఎం విజయ్‌ను హెచ్చరించారు స్టాలిన్. అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న విజయ్ మాటల్ని తప్పుబట్టిన ఆయన.. అబద్ధపు ప్రచారాలు ఆపాలంటూ చురకలంటించారు. 'ప్రభుత్వం వద్ద డబ్బులేదని వెంటనే చెప్పడం ప్రారంభించవద్దు. డబ్బు ఉంది.. కావాల్సింది దానిని ప్రజలకు ఇవ్వాలనే సంకల్పం, పాలించే సామర్థ్యం. ఐదేళ్లుగా కొవిడ్, వరదల వంటి సంక్షోభాలు సహా కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పోరాడుతూనే.. మేం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశాం. 'గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి ఖజానాను ఖాళీ చేసింది' అనే ఆరోపణను మీ మొదటి ప్రసంగంలోనే ప్రస్తావించారు. నిజానికి రాష్ట్రంలో అప్పు పరిమిత స్థాయిలోనే ఉంది. ఫిబ్రవరి బ్జడెట్‌లోనే మేం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా వివరించాం. ఆ విషయం మీకు తెలియదా? మీకు ఓటు వేసిన ప్రజలను మోసం చేసి.. విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దు! 'ఆచరణాత్మకంగా సాధ్యమయ్యే వాగ్దానాలు మాత్రమే ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు.. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనను ప్రారంభిస్తున్నారు. మాలాగే మీరు కూడా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎలా నెరవేర్చాలనే మెళకువలను త్వరలోనే తప్పకుండా నేర్చుకుంటారని నమ్ముతున్నాను. మీకు ఓటు వేసిన ప్రజలతో పాటు నేనూ అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలని మరోసారి నా శుభాకాంక్షలు!' అని తన సందేశాన్ని ముగించారు స్టాలిన్. కాగా.. కేంద్రంలో డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ మద్దతుతో నిన్న(ఆదివారం) టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం విజయ్‌కు ఎక్స్ వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు స్టాలిన్. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే విజయ్ సంతకం చేసిన ప్రకటనలను కూడా ఆయన స్వాగతించారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం వంటివి ప్రధాన ప్రకటనలలో ఉన్నాయి.



# లంచం మేసిన కేసులో కార్యదర్శి పట్టివేత

- సహకరించిన సర్పంచ్ భర్త కూడా అరెస్ట్

**సిద్దిపేట, మే 11 (జనంసాక్షి) :** లంచం మేసిన మరో ప్రభుత్వ ఉద్యోగని ఎసిబి పట్టుకుంది. బాధితుడి ప్లాట్‌లో నుంచి వెళు ్తన్న డైనేజీ పైప్‌లైన్ ను తొలగించేందుకు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజాగౌడ్ రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మధ్యవర్తిగా ఉన్న సర్పంచ్ భర్త గొల్లపల్లి ఆంజనేయులును సైతం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి హైదరాబాద్ కోర్టులో హాజరుపరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

- ధాన్యం కొనుగోళ్లు,తరుగుదోపిడీపై నిరసనలు
- అధికారులు స్పందించడం లేదన్న మాజీమంత్రి వేముల



**నిజామాబాద్, మే11 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని, తరుగు దోపిడీని అరికట్టాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు, మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దొడ్డు రకం ధాన్యానికి గ్రేడ్ వన్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరన్న తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతున్నదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పంటను అమ్ముకోవడానికి రైతులు నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మండి పడ్డారు. మూడు రోజులుగా పలు కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి రైతు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపా రు. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామ ని ప్రకటించి కేంద్రాలు తెరిచే సరికి 15 రోజులు, గన్నీ బ్యాగులు వచ్చేసరికి వారం, కాంటా పెట్టేసరికి మరో వారం అన్నట్లుగా 20 రోజుల పాటు కావాలనే జాప్యం చేసిందని ఆరోపిం చారు. మద్దతు ధర రూ.2,390 ఉండగా ప్రభుత్వ జాప్యం భరించలేక రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులకు రూ.1,750 నుంచి రూ. 1900లకే అమ్ము కుంటున్నారని, దీంతో ఎకరాకు సుమారు రూ.15వేలు నష్టపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, తరుగు పేరుతో 40 కిలోలకు 5 కిలోల అదనపు వడ్లు (క్వింటాలుకు 12.5 కిలోలు) దోచుకుం టున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాం లో ఇది కేవలం 1.5 కిలోలు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. రైతుల సమస్యలపై మాట్లాడేందుకు కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని, కనీసం స్పందించే తీరిక కూడా లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ పాలసీలో భాగమేనని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాకు లారీలను పెంచాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని, తరుగును తగ్గించి, పాత పద్ధతిలోనే వడ్లు సేకరించాలని, దొడ్డు రకానికి గ్రేడ్ -1 రేటుతో పాటు రూ.500 బోనస్ వెంటనే చెల్లిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉంద న్నారు. రైతులకు న్యాయం చేసే వరకు విశ్ర మించేది లేదని స్పష్టం చేశారు.

# జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, మే11 (జనంసాక్షి) :** జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనగణన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రచార వాహనం ద్వారా జిల్లాలో ప్రజలకు జనగణన ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జనగణన ప్రక్రియకు సంబంధించి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆదివారంతో ముగిసిందని, జిల్లాలో సుమారు 20 వేల మంది ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తి చేసుకున్నారని వివరించారు. నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో జనగణన నిర్వహణ కోసం సుమారు 1,400 మంది ఎన్యుమరేటర్లు, 200 మందికి పైగా సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు 33 ప్రశ్నలు అడుగుతారని, ప్రజలంతా అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. అందజేసే వివరాలన్నీ పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈసారి జనగణన ప్రక్రియ మొత్తం కాగిత రహితంగా, పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని తెలిపారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తైన అనంతరం రెండో దశ జనగణన చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర**

**హైదరాబాద్, మే11 (జనంసాక్షి) :** ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక పక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహిం చారు. ఎంపికైన అభ్యర్థులకు పారద ర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారు లు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకా శాలు పెరుగు తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితు లయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేం దుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేం దుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగ పడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలంది స్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# మోడీ మూడు దాడులు..!!

సంపాదకీయం

**నిన్న హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి వేదిక సభలో వినిపించిన మాటలు సామాన్యంగా అనిపించవచ్చు. కానీ లోతుగా చదివితే అవి కేవలం అభివృద్ధి మాటలు కాదు అవి రాజకీయ ఆహ్వానం, అంతర్గత హెచ్చరిక, సమాఖ్య వ్యవస్థపై దాడి, మూడూ ఒకేసారి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేదికపైకి పిలిచి "మీరు మాతో వస్తే గుజరాత్‌కు సమానంగా నిధులు ఇస్తాం, మీ లక్ష్యాలు మాతో ఉంటే మాతో రండి" అని చెప్పడం ఇది అభివృద్ధి సంభాషణ కాదు. ఇది బహిరంగ వేదికపై చేసిన రాజకీయ రిక్రూట్‌మెంట్.**

ఒక ముఖ్యమంత్రికి లక్ష్యాలు ఉంటాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాలు. ఆ లక్ష్యాలు సాధించాలంటే "మాతో రండి" అని చెప్పడం దేనికి సంకేతం? రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడం హక్కు, అభ్యర్థన కాదు. అది రాజ్యాంగం ఇచ్చిన హామీ – బేరసారాల బజారు కాదు. కానీ "రండి అప్పుడు ఇస్తాం" అన్న మాటలో దాగిన సందేశం స్పష్టంగా ఉంది. నేరుగా చెప్పకపోయినా, సభా వేదిక, సందర్భం, సంభాషణ తీరు పార్టీ మారాలనీ చెబుతున్నాయి. దీన్ని రాజకీయ భాషలో ముసుగు వేసిన పార్టీ మారమని ఆహ్వానం అంటారు. అసలు ముఖ్యమంత్రిని వేదికపైకి పిలవడం గౌరవమా? వ్యూహమా? అన్నది ప్రశ్నార్థకం.

సహకార సమాఖ్య సూత్రాల ప్రకారం కేంద్రం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి పని చేయాలి. ఇది మంచిదే. కానీ ఆ వేదికను ఉపయోగించి నిధుల హామీని పార్టీ విధేయతకు జత చేయడం, ప్రతిపక్ష నేతను బహిరంగంగా తమవైపు లాగే ప్రయత్నం చేయడం, మీ లక్ష్యాలు మాతో ఉంటే అని విలువలు కాదు, పదవీ ప్రయోజనాలు చూపించడం.. ఇవి సహకార లక్షణాలు కావు. రాజకీయ చదరంగం లో నడిపే ఎత్తుగడలు. గుజరాత్‌ను ప్రమాణంగా చూపించడం ఇది మొదటిసారి కాదు. దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు ఒక వేదన వ్యక్తం చేస్తున్నాయి. అధికంగా పన్నులు కట్టి, తక్కువ వాటా పొందుతున్నాం.. జనాభా నియంత్రణలో మెరుగ్గా ఉన్నందుకు లోక్‌సభ స్థానాలు తగ్గే ప్రమాదం, 16వ ఆర్థిక సంఘం కేటాయింపుల లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ఆందోళనవంటి నేపథ్యంలో "గుజరాత్‌కు సమానంగా ఇస్తాం" అన్న మాట దక్షిణాది రాష్ట్రాలకు ఒక చేదు వాస్తవాన్ని గుర్తు చేస్తోంది.

రేవంత్ రెడ్డి ఆ వేదికపై ఏం సమాధానం చెప్పారో బహిరంగంగా తెలియదు. కానీ ఆయన ముందు ఒక స్పష్టమైన నైతిక నిర్ణయం నిలుచుంది. నిధుల కోసం రాజకీయంగా రాజీపడటం, తాత్కాలికంగా రాష్ట్రానికి లాభం కలిగినా, దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యానికి నష్టం. నిటారుగా నిలబడి, రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను రాజ్యాంగ మార్గంలో డిమాండ్ చేయడం. ఇది కష్టమైన దారి. కానీ సమాఖ్య గౌరవాన్ని నిలబెట్టే దారి. ఏ దారిలో వెళ్తారో ఆయన ఇష్టం. కానీ అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికే సమాఖ్య నిర్మాణంగా చూడాలి. నేడు కేంద్రం చేస్తున్నది ఏమిటి? విధేయత చూపిన రాష్ట్రాలకు నిధులు, ప్రశ్నించిన రాష్ట్రాలకు నిరాదరణ, పార్టీ మారమని బహిరంగ ఆహ్వానాలు వంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. ఇది కోపరేటివ్ ఫెడరలిజం కాదు.. కోర్సివ్ ఫెడరలిజం (బలవంతపు సమాఖ్యవాదం).

హైదరాబాద్ వేదికపై జరిగింది ఒక్క రేవంత్ రెడ్డికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. ఇది దేశంలోని ప్రతిపక్ష పాలిత అన్ని రాష్ట్రాలకూ హెచ్చరిక. "మాతో రా, లేదా కష్టపడు" అన్న సందేశం స్థిరపడితే రేపు ఏ ముఖ్యమంత్రి అయినా తమ రాష్ట్ర ప్రజల తరఫున నిర్భయంగా నిలబడగలరా? ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పు అత్యున్నతమైనది. ఆ తీర్పును నిధుల బేరంతో మార్చే ప్రయత్నం, ఇది ఓటరుకు చేసిన అవమానం. తెలంగాణ ప్రజలు, దక్షిణాది రాష్ట్రాల ప్రజలు, సమాఖ్య విలువలను నమ్మే ప్రతి భారతీయుడు ఈ ప్రశ్న అడగాలి. అభివృద్ధి పేరిట జరుగుతున్నది నిజంగా అభివృద్ధా? లేక అధికార విస్తరణా?ఆ ప్రశ్నకు సమాధానమే భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# మలి తెలంగాణ ఉద్యమాలు - జ్ఞాపకాలు

**భువనగిరి గర్జన - దగాపడ్డ తెలంగాణ మేల్కొలుపు (1997)**

**చర్చల నుండి నుండి క్షేత్రస్థాయి పోరాటానికి**

1995-96 కాలంలో మేధావుల గదుల్లో, చిన్న చిన్న సదస్సుల్లో సాగిన తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష, 1997 నాటికి ఒక ఉప్పెనలా ప్రజాక్షేత్రంలోకి దూసుకువచ్చింది. 1969 ఉద్యమం తర్వాత తెలంగాణ సమాజం ఒక రకమైన రాజకీయ విస్మృతిలో ఉన్న తరుణంలో, మలిదశ ఉద్యమానికి ఆక్సిజన్‌ను అందించిన మహోత్కార్యం "భువనగిరి సభ". 1997 మార్చి 8, 9 తేదీల్లో జరిగిన ఈ సభ, తెలంగాణ అస్తిత్వ పోరాట చరిత్రను మలుపు తిప్పింది. ముఖ్యంగా తెలంగాప్రాంత ముఖ్య మంత్రి డా. మర్రి చెన్నారెడ్డి కాలం తీరక ముందే దిగి పోయి నేదురుమిల్లి జనార్ధన రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ ప్రాంత ప్రజలపై తీవ్ర నిర్బంధాలు ప్రయోగించారు. చిత్రహింసలు ఎన్‌కౌంటర్లు పెరిగి పోయాయి. విప్లవ సంస్థలను నిషేదించారు. ఆ నేపథ్యంలో చైతన్యవంతులైన ప్రజలు మా రాష్ట్రం మాకుంటే ఈ నిర్బంధాలు ఉండవు అని భావించారు. ఆచార్య కె జయ శంకర్‌కు రెండో టర్మ్ కాకతీయ వైస్ ఛాన్సలర్ గా అవకాశం రాక పోవడం కూడా ఆంధ్ర నాయకత్వం పట్ల వ్యతిరేకత పెరిగింది. కోదండరాం తెలంగాణ విద్యావంతులను సమీకరించారు. బహుజన రచయితలు బిఎస్ రాములు, బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల్లో బహుజన సామాజిక తెలంగాణ చైతన్యం నింపారు. ఆకుల భూమయ్య, వైకుంఠం తదితరులు తెలంగాణ జన సభల నిర్మాణం కోసం యుద్దానికి సన్నద్ధం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బిజేపీ వారు నిశ్శబ్దంగా చాపకిందటి నీరులా 1993 నుండి తెలంగా రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఆ నేపథ్యంలో అనేక సభలు జరిగాయి. భువనగిరి సభ ఒక మలుపు.

**భువనగిరి సభ నేపథ్యం - 'దగాపడ్డ తెలంగాణ'**

మేధావులు చేస్తున్న విశ్లేషణలు సామాన్య ప్రజల భాషలోకి తర్జుమా కావాల్సిన అవసరం ఆనాడు ఏర్పడింది. అప్పటికే తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం బలంగా ఉన్నా, అది వర్గ పోరాటం వైపే మొగ్గు చూపేది. కానీ, భువనగిరి వేదికగా "ప్రాంతీయ అస్తిత్వం - సామాజిక న్యాయం" అనే కొత్త సిద్ధాంతం తెరపైకి వచ్చింది. ఈ సభకు 'దగాపడ్డ తెలంగాణ' అని పేరు పెట్టడం వెనుక ఉన్న ఉద్దేశం చాలా స్పష్టమైనది. తెలంగాణ కేవలం వెనుకబడి లేదు, అది పాలకుల చేతిలో క్రమబద్ధంగా దగా చేయబడింది (Systematic Deception) అని ప్రజలకు వివరించడమే దీని ప్రధాన లక్ష్యం.

**సిద్ధాంత చర్చ: కేవలం భౌగోళికం కాదు.. సామాజిక తెలంగాణ**



భువనగిరి సభలో జరిగిన చర్చలు అసాధారణమైనవి. అప్పటివరకు కేవలం "610 జీవో", "ముల్కీ నిబంధనలు" వంటి సాంకేతిక అంశాల చుట్టూ తిరిగిన ఉద్యమం, ఇక్కడ సామాజిక రూపును సంతరించుకుంది.

- **కులవృత్తుల విధ్వంసం:** తెలంగాణ పల్లెల్లో కులవృత్తులు ఎలా దెబ్బతిన్నాయో, సీమాంధ్ర పెట్టుబడిదారీ వ్యవస్థ తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఎలా చిన్నాభిన్నం చేసిందో చర్చించారు.
- **అస్తిత్వ వేదన:** మన భాషను 'యాస' అని అవమానించడం, మన పండుగలను చిన్నచూపు చూడటంపై కళాకారులు గర్జించారు.
- **రాజకీయ స్పృహ:** ఢిల్లీ లేదా మద్రాసు పాలకుల కంటే, పక్కనే ఉన్న ఆంధ్ర పాలకుల దోపిడీ ప్రమాదకరమైనదని ఈ సభ హెచ్చరించింది.
- **మేధావుల అనుసంధానం:** వివిధ సిద్ధాంతాలు కలిగిన వ్యక్తులను, విభిన్న కుల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో కొంత మేరకు సఫలమయ్యారు.
- **దళిత-బహుజన దృక్పథం:** తెలంగాణ ఉద్యమం కేవలం ఒక వర్గానిది కాదని, ఇందులో దళిత, బహుజనుల వాటా ఉండాలని ఆయన బలంగా వాదించారు. భువనగిరి డిక్లరేషన్‌లో సామాజిక అంశాలు చోటు చేసుకోవడానికి ఎందరో కృషి చేశారు.
- **కళాకారుల విప్లవం:** గద్దర్ మరియు ప్రజా యుద్ధ నౌకల గళం భువనగిరి సభలో గద్దర్ చేసిన ప్రసంగం, ఆయన పాడిన పాటలు తెలంగాణ పల్లెపల్లెను కదిలించాయి. "అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా" అనే పాట ఉద్యమానికి గీతమై నిలిచింది.
- **ప్రజా యుద్ధ నౌక:** గద్దర్ ఈ వేదిక నుండి చేసిన గర్జన, ఉద్యమం లోకి యువతను, గ్రామీణ రైతాంగాన్ని పెద్ద ఎత్తున ఆకర్షించింది. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమనే తెగువను ఈ సభ నింపింది.
- **కళా రూపాలు:** ధూమ్ ధామ్ వంటి కార్యక్రమాలు, ఆట, పాట ద్వారా రాజకీయ చైతన్యాన్ని తీసుకురావడం అనేది మలిదశ ఉద్యమ ప్రత్యేకత.

**తీర్మానాలు.. చారిత్రక ప్రాధాన్యత**

**ఈ సభ ముగింపులో చేసిన తీర్మానాలు అత్యంత గంభీరమైనవి:**

- తెలంగాణ కోసం ప్రత్యేక రాజకీయ పార్టీ లేకపోయినా, ప్రజా సంఘాల ద్వారానే పాలకుల మెడలు వంచాలి.
- తెలంగాణలోని వనరులపై తెలంగాణ ప్రజలకే హక్కు ఉండాలి.
- నీటి కేటాయింపుల్లో జరుగుతున్న అన్యాయంపై రాజీలేని పోరాటం చేయాలి.

ఈ సభ ఫలితంగానే తర్వాత కాలంలో తెలంగాణ జనసభ వంటి సంస్థలు ఏర్పడి, గ్రామగ్రామాన తెలంగాణ జెండా రెపరెపలాడేలా చేశాయి. భువనగిరి సభ ఇచ్చిన స్ఫూర్తితోనే, రాజకీయ నాయకులు కూడా తెలంగాణ అంశాన్ని తమ ఎజెండాలోకి తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

నేటి తరం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, తెలంగాణ ఆవిర్భావం అనేది కేవలం 2014లో జరిగిన ప్రక్రియ కాదు. అది 1997లో భువనగిరి కొండల సాక్షిగా జరిగిన గర్జనలో పుట్టిన నిప్పు . గద్దర్ వంటి కళాకారుల ఆవేశం, మరియు వేలాది మంది సామాన్య జనం చేసిన శపథం నేటి స్వరాష్ట్రానికి పునాది. మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ వెనుక, ఆనాడు భువనగిరి సభలో వ్యక్తమైన "దగాపడ్డ వేదన" ఉంది. వందలాది విద్యావంతులు ఎక్కడికక్కడ సభలు సమావేశాలు నిర్వహించడం వేగ వంతమైంది. నాగేటి చాల్లలో నా తెలంగాణ నా తెలంగాణ పాట నందిని సిధార్ధి కలం నుండి అపుడే రూపు దిద్దుకున్నది. మారోజు వీరన్న నాయకత్వంలో పెద్ద ఎత్తున మహా సభలు జరిగాయి. 1969 ఉద్యమ కారుల వేదిక తరపున డాక్టర్ కొల్లూరి చిరంజీవి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రముఖ కవులు గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, వరంగల్ శ్రీను, జయరాజు, అల్లం నారాయణ, ఎ. సురేందర్ రాజు, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, కాసుల ప్రతాప రెడ్డి మొదలైన రచయితలు తమ గొంతు వినిపించడం మొదలైంది.



**- బి ఎస్ రాములు**
**సామాజిక తత్వ వేత్త**
**ఫో: 8331966987**

# అరాచకం పెరుగుతున్న వేళ : ప్రజాస్వామ్యానికి ప్రమాదం

ప్రతి రాజకీయ వ్యవస్థకూ ప్రాణం పోసేది సహనం, సంభాషణ. ఓటమి మీద విజయం, భిన్నాభిప్రాయాల మీద ఏకాభిప్రాయం ప్రాధాన్యం సంతరించుకోవాలి. కానీ నేటి భారత రాజకీయ దృశ్యంలో అధికారం సాధించిన వెంటనే ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా మారడం గమనించవచ్చు. "లోకే భిన్నరుచిః" అని పెద్దలు చెప్పిన మాటను మరచిపోయినట్లుగా, ఒకే అభిప్రాయాన్ని మినహాయించి మిగతావన్నీ ద్రోహాలుగా ముద్రవేసే అప్రజాస్వామిక ధోరణి దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది.

పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఇటీవలి ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజుల్లో చోటుచేసుకున్న ఘటనలు ఈ దుష్ప్రవృత్తికి అద్దం పడతాయి. ఎక్కడో ఒక ప్రత్యేక పార్టీకి సంబంధించిన దాడులు మాత్రమే ఇవి కావు; ఇది దేశవ్యాప్తంగా పాతుకుపోతున్న ఒక నమూనా. విజయం లభించిన మరుక్షణం నుంచే పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ అనుకూల అరాచక శక్తులు తమ విధ్వంసాన్ని మొదలుపెట్టాయి. కేంద్రం నుంచి పంపిన వేలాది పోలీసులు ఇంకా విధుల్లో ఉండగానే ఈ హింసకు తెరలేచింది.

సీపీఐఎం కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తల నివాసాలు లక్ష్యమయ్యాయి. భవనాల కూల్చివేత, నిప్పంటించడం, జనావాసాలపై దాడులు సామాన్యంగా మారాయి. ముర్షిదాబాద్ జిల్లాలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన విషయం మనకు తెలిసిందే. ఇదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయాలపై కూడా దాడులు, గృహ దహనాలు జరిగాయి. విచిత్రమేమిటంటే, రక్షణ కల్పించాల్సిన పోలీసులు కేవలం తటస్థ దర్శకులుగా మారిపోయారు.

డోమ్‌కల్ ఘటన మరింత బీభత్సాన్ని వెల్లడిస్తుంది - పనిప్రదేశం నుంచి ఇంటికి వెళ్తున్న సీపీఐఎం కార్యకర్త షఫీకుల్ ఇస్లాంపై బీజేపీలో చేరినందుకు తృణమూల్ గూండాలు కాల్పులు జరిపారు. కారణం? ఆ ప్రాంతంలో సీపీఐఎం అభ్యర్థి విజయం జీర్ణించుకోలేకపోవడం. కేరళలో కాంగ్రెస్, ఐయుఎంఎల్ మూకలు సీపీఐఎం కార్యాలయాలపై బాంబులు విసిరి విధ్వంసం సృష్టించాయి. పాలక్కాడ్లో ఇది జరిగింది. గతంలోకి వెళ్తే, 2011లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీపీఐఎంపై ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడిందనే చరిత్ర ఉంది. వేలాది మంది కార్యకర్తలు, సానుభూతిపరులను గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. త్రిపురలో 2018లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఇదే పద్ధతి పునరావృతమైంది. ఆ రాష్ట్రంలో ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి కూడా వీల్లేని స్థితి వామపక్షాలు ఎదుర్కొన్నాయి.

కేరళలో 2000 నుంచి 2017 మధ్యకాలంలో బీజేపీ, సంఘ్ పరివార శక్తులు 85 మంది సీపీఐఎం కార్యకర్తలను హతమార్చాయనే గణాంకం రక్తిని పెంచుతుంది. కాంగ్రెస్, ముస్లిం లీగ్ అరాచకవాదులు కూడా దాడులు, దౌర్జన్యాలలో వెనుకబడలేదు. 1972లో పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్ పాలకులు సాగించిన అర్ధ-ఫాసిస్టు బీభత్సంలో 1200 మందికి పైగా సీపీఐఎం కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాకాండ కేవలం రాజకీయ పార్టీల మధ్య విరోధం మాత్రమే కాదు; ఇది నాగరిక సమాజం మీద, మానవీయ విలువల మీద చేసే దాడి. ప్రస్తుతం ఢిల్లీ నాయకులు నుంచి గల్లీ నాయకుల వరకు మాటల స్థాయిని దాటి భౌతిక దాడులకు, బలప్రదర్శనలకు దిగడం సర్వసాధారణమైపోయింది. బుల్డోజర్ సంస్కృతి పెరిగి, ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు, కార్యాలయాలు, పంటతోటలు, నాయకుల చిత్రపటాలు, విగ్రహాల విధ్వంసం జరుగుతోంది. ప్రత్యర్థిపై హత్యల వరకూ సాగిన ఘటనలు లేవనెత్తుతున్నాయి. ఇదంతా అప్రజాస్వామిక సంస్కృతికి స్పష్టమైన నిదర్శనం. తమకు ఇష్టం లేని రాజకీయ పక్షాల మీద, వ్యక్తుల మీద దాడి మాత్రమే కాదు; ఇది ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి, సహజీవన సంస్కృతికి గొడ్డలిపెట్టు. ప్రధాని మోడీ హయాంలో సుపరిపాలన గురించి దీర్ఘ ఉపన్యాసాలు వింటున్నాము కానీ, ఇలాంటి దుర్మార్గం నిరాటంకంగా సాగడం పెద్ద ప్రశ్నార్థకం.

ఈ అరాచకాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలి. ఇకపై రాజకీయ పార్టీలు, అధికార పక్షం, ప్రతిపక్షం అనే వివక్షత లేకుండా చట్టపరిధి దాటిన వారందరిపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలి. ఎన్నికల సంఘం ఎక్కడికక్కడ అధికార యంత్రాంగాన్ని, పోలీసు బలగాలను అప్రమత్తం చేసి, అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే మన దేశం తన గొప్ప సాంస్కృతిక వారసత్వం, నాగరికతను నిలబెట్టుకోగలదు. ఈ గూండాగిరి, దాదాగిరి సమాజం నుండి పూర్తిగా దూరం కావాలంటే ఇదే మార్గం.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# హిందూ-ముస్లిం ఓటు బ్యాంకు చర్చలు

నిన్నటి సంచిక తరువాయి


ప్రస్తుతం బెంగాల్ రాజకీయాలను పరిశీలిస్తే రాష్ట్రం ఒక తీవ్రమైన భావజాల పోరాట వేదికగా మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ తన ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పోరాడుతుండగా మరోవైపు భారతీయ జనతా పార్టీ జాతీయవాద భావజాలాన్ని బలంగా విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. ఇదే సమయంలో ఒకప్పుడు బెంగాల్ రాజకీయాలను పూర్తిగా ప్రభావితం చేసిన వామపక్ష పార్టీలు తమ పాత బలాన్ని తిరిగి సాధించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రజల్లో పూర్వ స్థాయి ప్రభావాన్ని చూపలేకపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా రాష్ట్రంలో క్రమంగా బలహీనపడింది. 1952లో 45% కంటే ఎక్కువ ఓట్లను సాధించిన కాంగ్రెస్ ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైపోయిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

బెంగాల్ రాజకీయాలలో మతపరమైన ధృవీకరణ కూడా ఇటీవల కాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో వర్గ పోరాటాలు, రైతు ఉద్యమాలు, కార్మిక సమస్యలు ప్రధాన రాజకీయ అంశాలుగా ఉండేవి. అయితే ఇప్పుడు హిందూ-ముస్లిం ఓటు బ్యాంకుల చర్చలు రాజకీయ ప్రచారంలో ప్రధాన భాగంగా మారాయి. రాష్ట్ర జనాభాలో సుమారు 27% వరకు ముస్లిం జనాభా ఉండటం రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ మైనారిటీల మద్దతును సంపాదించుకుంటోందని బిజెపి ఆరోపిస్తుండగా, మరోవైపు బిజెపి హిందుత్వ రాజకీయాల ద్వారా సమాజంలో విభజన పెంచుతోందని తృణమూల్ విమర్శిస్తోంది. ఈ రాజకీయ పోటీ రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని కూడా ప్రభావితం చేస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఆర్థిక పరంగా చూస్తే బెంగాల్‌కు ఉన్న అవకాశాలు చాలా పెద్దవి. ఒకప్పుడు కోల్‌కతా నగరం భారతదేశ ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందింది. బ్రిటిష్ పాలన కాలంలో పరిశ్రమలు, నౌకాశ్రయాలు, వాణిజ్య కేంద్రాలు, జూట్ పరిశ్రమల ద్వారా బెంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించింది. కానీ స్వాతంత్ర్యం తర్వాత ముఖ్యంగా 1970ల నుంచి కార్మిక ఉద్యమాలు, పెట్టుబడిదారుల వలసలు, రాజకీయ అస్థిరత కారణంగా పరిశ్రమలు క్రమంగా తగ్గిపోయాయి. 1960లలో దేశ పరిశ్రమల ఉత్పత్తిలో బెంగాల్ వాటా సుమారు 20% వరకు ఉండేదని అంచనాలు చెబుతుంటే ప్రస్తుతం అది 6% నుంచి 7% మధ్యకు పడిపోయిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిస్థితి యువతలో నిరాశను పెంచింది.

ఉద్యోగాల కోసం బెంగాల్ యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా ఐటీ, తయారీ రంగం, ఔషధ పరిశ్రమ, ఆటోమొబైల్ రంగాలలో తగిన పెట్టుబడులు రాకపోవడం వల్ల అవకాశాలు పరిమితమయ్యాయి. తృణమూల్ ప్రభుత్వం చిన్న పరిశ్రమలు, సేవా రంగ అభివృద్ధికి కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పెద్ద పరిశ్రమల పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరిస్థితిని బిజెపి బలంగా విమర్శిస్తూ "డబుల్ ఇంజిన్ ప్రభుత్వం" అవసరమని ప్రచారం చేస్తోంది. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే పార్టీ చేతుల్లో ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందని బిజెపి వాదిస్తోంది.

ఇటీవల మే 4న వెలువడిన రాజకీయ సంకేతాలు బిజెపి ఆశలను మరింత పెంచాయి. స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామీణ స్థాయి రాజకీయ మార్పులు, యువ ఓటర్ల ధోరణి బిజెపికి అనుకూలంగా మారుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో అవినీతి వ్యతిరేక భావజాలం పెరుగుతుండటం బిజెపికి లాభం చేకూర్చవచ్చని అంచనాలు ఉన్నాయి. ఉపాధ్యాయ నియామక కుంభకోణం వంటి అంశాలు తృణమూల్ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. వేలాది మంది నిరుద్యోగులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలపడం ప్రభుత్వానికి ప్రతికూల పరిస్థితిని తీసుకొచ్చింది.




అయితే బెంగాల్ రాజకీయాలను కేవలం ఎన్నికల గణాంకాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అక్కడ సాంస్కృతిక రాజకీయాలు కూడా ఎంతో ప్రభావవంతంగా ఉంటాయి. రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, ఇశ్వర్ చంద్ర విద్యాసాగర్, కాజీ నజ్రుల్ ఇస్లాం వంటి మహనీయుల ఆలోచనలు బెంగాల్ సమాజంపై లోతైన ప్రభావం చూపించాయి. మేధో చర్చలు, సాహిత్య ఉద్యమాలు, విద్యార్థి రాజకీయాలు అక్కడ ప్రజాస్వామ్య సంస్కృతిని బలపరిచాయి. అందుకే బెంగాల్ ప్రజలు కేవలం భావోద్వేగాలకు లోనై ఓటు వేయరని, రాజకీయ చైతన్యంతో నిర్ణయాలు తీసుకుంటారని విశ్లేషకులు భావిస్తారు.

*మరో ముఖ్యమైన అంశం రాజకీయ హింస. బెంగాల్ ఎన్నికలు తరచూ హింసాత్మక ఘటనలకు వేదికగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పార్టీ ఆధిపత్య పోరు కారణంగా అనేక ఘర్షణలు జరుగుతున్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా అనేక హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోటీ సహజమే అయినప్పటికీ హింస పెరగడం ప్రజాస్వామ్య విలువలకు ముప్పుగా మారుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. ప్రజల స్వేచ్ఛాయుత ఓటు హక్కు భయాందోళనలకు గురికాకుండా ఉండటం అత్యంత అవసరం.*

బెంగాల్ భవిష్యత్ రాజకీయాలలో మహిళా ఓటర్ల పాత్ర కూడా కీలకంగా మారుతోంది. రాష్ట్రంలో మహిళా ఓటర్ల శాతం సుమారు 49% వరకు ఉంది. కన్యాశ్రీ, లక్ష్మీ భండార్ వంటి పథకాల ద్వారా తృణమూల్ మహిళల్లో బలమైన మద్దతు సంపాదించుకుంది. అదే సమయంలో మహిళా భద్రత, ఉపాధి అవకాశాలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి. యువ మహిళా ఓటర్లు అభివృద్ధి, ఉద్యోగాలు, విద్యా అవకాశాలను ప్రధానంగా చూస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

భారతీయ జనతా పార్టీకి బెంగాల్‌లో ప్రధాన సవాలు ప్రాంతీయ భావజాలాన్ని అధిగమించడం. బెంగాల్ ప్రజలు తమ భాష, సంస్కృతి, ప్రాంతీయ అస్తిత్వాన్ని ఎంతో గౌరవిస్తారు. బయట రాష్ట్రాల నుంచి రాజకీయ ఆధిపత్యం వస్తోందనే భావన కలిగితే ప్రజల్లో ప్రతికూలత పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే బిజెపి కూడా ఇప్పుడు బెంగాలీ సంస్కృతి, స్థానిక నాయకత్వం, ప్రాంతీయ గౌరవం వంటి అంశాలపై దృష్టి పెడుతోంది. ఇదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ "బెంగాల్ గర్వం" అనే భావనను బలంగా ప్రచారం చేస్తోంది.

ప్రస్తుతం బెంగాల్ రాజకీయ పరిస్థితి చూస్తే రాబోయే సంవత్సరాలు అత్యంత కీలకంగా మారబోతున్నాయి. ప్రజలు సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి, పెట్టుబడులు, పరిశ్రమలు, శాంతిభద్రతలు, అవినీతి రహిత పాలన కోరుకుంటున్నారు. ఒకప్పుడు భావజాల రాజకీయాలకు కేంద్రంగా ఉన్న బెంగాల్ ఇప్పుడు అభివృద్ధి రాజకీయాల వైపు కూడా మళ్లుతున్నట్లు కనిపిస్తోంది. ఇదే ధోరణి కొనసాగితే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది.

ప్రజాస్వామ్యంలో చివరకు గెలిచేది ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన నాయకత్వమే. బెంగాల్ చరిత్ర చెబుతున్న గొప్ప పాఠం కూడా అదే. 34 సంవత్సరాల వామపక్ష పాలనను ప్రజలు మార్చారు. బలమైన కాంగ్రెస్‌ను పక్కన పెట్టారు. తృణమూల్‌ను అధికారంలోకి తెచ్చారు. ఇప్పుడు మరోసారి మార్పు అవసరమని భావిస్తే అదే ప్రజలు కొత్త రాజకీయ శక్తికి అవకాశం ఇవ్వవచ్చు. అందుకే బెంగాల్ రాజకీయాలు దేశవ్యాప్తంగా ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తుంటాయి. ప్రస్తుతం అక్కడ కనిపిస్తున్న రాజకీయ మార్పుల సంకేతాలు భారత ప్రజాస్వామ్య భవిష్యత్ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశముందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.ముగింపుగా పరిశీలిస్తే పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్ర భారత ప్రజాస్వామ్య పరిణామ క్రమానికి ఒక ప్రతిబింబంలా కనిపిస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ ఆధిపత్యం, తరువాత వామపక్ష ఉద్యమాల ఎదుగుదల, అనంతరం తృణమూల్ కాంగ్రెస్ ఆవిర్భావం, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ విస్తరణ – ఈ మొత్తం ప్రయాణం ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన శక్తి అన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. బెంగాల్ ప్రజలు ఎప్పుడూ ఒకే రాజకీయ శక్తికి శాశ్వత అధికారాన్ని ఇవ్వలేదు. ప్రజల అవసరాలు, కాలానుగుణ మార్పులు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక అవసరాల ఆధారంగా తమ రాజకీయ నిర్ణయాలను మార్చుకుంటూ వచ్చారు. ఇదే ప్రజాస్వామ్య బలమని చెప్పాలి. బెంగాల్ ప్రత్యేకత ఏమిటంటే అక్కడి రాజకీయాలు కేవలం అధికార పోరాటంగా మాత్రమే ఉండవు. అవి భావజాలాలతో, మేధో చర్చలతో, సాంస్కృతిక ఆత్మగౌరవంతో, సామాజిక ఉద్యమాలతో ముడిపడి ఉంటాయి. అందుకే దేశ రాజకీయ విశ్లేషకులు ఎప్పుడూ బెంగాల్‌ను ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తారు. భారతదేశంలో ఎన్నో రాజకీయ మార్పులకు బెంగాల్ వేదికగా నిలిచింది. స్వాతంత్ర్యోద్యమం నుంచి రైతాంగ పోరాటాల వరకు, కార్మిక ఉద్యమాల నుంచి విద్యార్థి రాజకీయాల వరకు బెంగాల్ దేశ ప్రజాస్వామ్య సంస్కృతిని బలోపేతం చేసింది.

1977 నుంచి 2011 వరకు కొనసాగిన 34 సంవత్సరాల వామపక్ష పాలన ప్రపంచ రాజకీయ చరిత్రలోనే అరుదైన అధ్యాయంగా నిలిచింది. ఎన్నికల ద్వారా అంతకాలం ప్రజల మద్దతును నిలుపుకోవడం చిన్న విషయం కాదు. గ్రామీణ పేదల కోసం భూసంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, స్థానిక సంస్థల బలోపేతం వంటి చర్యలు లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి బలమైన మద్దతు తెచ్చాయి. కానీ అదే సమయంలో పరిశ్రమల క్షీణత, ఉద్యోగ అవకాశాల కొరత, పెట్టుబడుల పారిపోవడం వంటి సమస్యలు క్రమంగా ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. చివరకు ప్రజలు మార్పు కోరుకున్నారు. ఆ మార్పు రూపమే మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

మిగితా తరువాయి సంచికలో..




## నేనే !

కలిమికిపెద్దోడినా?
కష్టానికిపెద్దోడినా?
బుద్ధికి పెద్దోడినా ?
ఈ ప్రశ్నలొద్దు!
దేవుణ్ణే అనుకోండి
దేవుడే తిడితే
మహాప్రసాదంగా
భావిస్తారుకదా!
వెర్రికుంకల్లారా!

ఎక్కడ పుట్టాం
ఎక్కడ పెరిగాం
ఎక్కడో తిరిగాం!
పిచ్చి సన్నాసుల్లారా!
మనమధ్యభేదాలన్నీ
ఆయాసందర్భాల్లో
స్వార్థంతో రాసినవే!
నామాట వినండి!

వేదశాస్త్రపురాణాలు
కావ్య స్మృతి శిక్షలు
ఏవీ పరిపూర్ణంకాదు!
నా మాట వినండి!
ధర్మంలో ధర్మం ఉంటే
ముదుపాదాలు
ఎందుకు విరిగాయి!

సత్యం చెపుతున్నాను!
చిన్నపిల్లల్ని అడుగు
'కలిసుందాం'అంటారు!
వీళ్లకు'ఆమాటే'నచ్చదు!
విడదీస్తూవచ్చారు!
ఇప్పటికీ అదేపని!
కాళ్ళు విరగవామరి?
అంతా అధర్మమే!
జనం కష్టం కాజేసి
ఇష్టారాజ్యంచేస్తూ
వాళ్ల సమాదులమీద
వీళ్ళ పునాదులు!
నేను'కారల్ మార్క్స్' ను
నేను 'అంబేద్కర్' ను
నేను మీ దేవుణ్ణి
నన్ను నమ్మండి!

స్వార్థంలేని వాళ్లే
దీనిని చదవగలరు!
అర్థం చెప్పగలరు!
పరమార్థంవిప్పగలరు!
ఇరిగినమూడుకాళ్ళు
అధర్మ పూరితాలు!
మిగిలిన ఒక్కకాలే
ధర్మాన్ని మోస్తోంది!

ఔను!కష్టానికిపెద్దోడిని!
యుగయుగాల కష్టాన్ని
ఆఒక్కకాలు కన్నీళ్ళతో
తనకష్టాన్నిచెపుతోంది!
ఒరే సన్నాసుల్లారా!
ధర్మాన్ని మొయ్యటానికి
వంకర'బుద్ర'వాళ్ళది !
కాళ్ళు మాత్రం నావి !
నావిఅంటే నేనే కాదు!
నువ్వు!వాడు!ఆమె!
కాళ్ళుచేతులేమనవి !

అందరం కలిసి 'నేను'!
పేదల ప్రతినిధిని!
పనిచెయ్యటమేకాదు !
'బుద్ధి'తో ఆలోచిద్దాం!
'బుద్ధిగా'కలిసుందాం!
పేదల్ని పీక్కతినటమే
సర్వధర్మ సారం!
అందుకే కాళ్లిరిగాయి!
ఆ ఒక్క కాలు 'నేనే'!

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# రైతు శ్రేయస్సే రాష్ట్ర ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు
- ధాన్యం తరలింపులో సమన్వయంతో పనిచేయాలి
- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 11 (జనంసాక్షి) :** రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతు కేంద్రంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, కొనుగోలు దారులు, రైస్ మిల్లర్లు పూర్తి స్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎవరూ ఎవరినీ బతిమాలుకునే పరిస్థితి రాకుండా, ఎవరు ఎవరిని నిందించాల్సిన అవసరం లేకుండా జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అందరూ సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సుఖ జీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రబీ 2025--26 సీజన్‌కు సంబంధించిన వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల ఉన్నతాధికారులు, డీసీఓల సీఈఓలు, డీఆర్‌డీఓల ఏపీఎంలు, మండల వ్యవసాయ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, మార్కెటింగ్, రవాణా, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు, రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లుల ప్రతినిధులు, లారీ కాంట్రాక్టర్లు, ఏఎంసీ కార్యదర్శులతో లతో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా స్థాయి విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ప్రతి అంశాల వారీగా కులంకషంగా చర్చించి కొనుగోలు ప్రక్రియలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై, జిల్లా కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు జారీ చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారుల కు మెమోలు జారీ చేయాలని మంత్రి కలెక్టర్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఎక్కడైనా సమస్యలను ఎదుర్కొంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, మొక్కజొన్న కొనుగోలు చేసి అందుకు అవసరమైన గోదాములు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గన్నీ బ్యాగుల సరఫరా, ధాన్యం నిల్వ, రవాణా, తేమ శాతం నిర్ధారణ, రైతులకు చెల్లింపుల ప్రక్రియ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

## చేవెళ్ల నుండి కలెక్టరేట్ కార్యాలయానికి బస్సులు నడపాలి



**చేవెళ్ల, మే 11 (జనంసాక్షి) :** చేవెళ్ల నుండి రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లోని కలెక్టరేట్ కార్యాలయం వరకు రోజుకు నాలుగు బస్సులు నడపాలని చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రగతి శిలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ..చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్, మండలాల, గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి, లేదా పరిష్కరించుకోవడం కోసం కలెక్టరేట్ కి వెళ్దామంటే సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరికీ అందుబాటులో ఉండాల్సిన కలెక్టరేట్ కార్యాలయం అడవిలో ఉన్నది కాబట్టి అక్కడికి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదని ప్రజలకు విద్యార్థులకు ఉద్యోగులకు ఇబ్బందిగా ఉందన్నారు. పేద ప్రజలు ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్ కి వెళ్లడానికి కూడా ఎలా వెళ్లాలని అర్థం కాని పరిస్థితి ఉందని, చేవెళ్ల నుండి కలెక్టరేట్ కి ఉదయం నుండి సాయంత్రం వరకు నాలుగు బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా సిటీ సబర్బన్ బస్సులలో జనరల్ పాస్, డే పాస్ ని తోల్కట్ట గెట్ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దానిని చేవెళ్ల వరకు అనుమతించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు బొజ్జి శ్రీకాంత్, న్యాలట అశోక్, పిడిఎస్ యు షాబాద్ మండల అధ్యక్షుడు అనిల్ ఉన్నారు.

## రాళ్లగూడా రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి



**శంషాబాద్, మే 11 (జనంసాక్షి) :** శంషాబాద్ మండలంలోని రాళ్లగూడా రోడ్డు వెడల్పు, నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ 119 కొత్వాలుగూడా డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజలు, యువత, మహిళలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సడక్ బంద్ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొనమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు మరియు కాంట్రాక్టర్లు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్డు పనుల వల్ల దుమ్ము, ధూళి అధికమై ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, రోజువారీ కూలీలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులను వేగవంతం చేయాలని, లేకపోతే రానున్న రోజుల్లో జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, రాజేందర్, రాచమల్ల జయసింహ, మంచర్ల శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

**హయత్‌నగర్, మే 11 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.7ను తక్షణమే రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్బీనగర్‌లో సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ కెవి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన "విద్యార్థి వేదన దీక్ష" కు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసే విధానంతో ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆయన విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రాధాన్యం ఇస్తూ పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్య దూరం చేస్తున్నారని ఆరోపించారు. 2009 విద్య హక్కు చట్టాన్ని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, నేడు రాష్ట్రంలో అదే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు చట్టానికి తూట్లు పొడిచిందని ఎద్దేవా చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయం అని అన్నారు. ఈ సందర్భంగా కెవి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని ఇది ముమ్మాటికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని నిప్పులు చెరిగారు. దాదాపు 7 లక్షల 85 వేల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఫీజు రియంబర్స్మెంట్ పాత విధానాన్ని అమలు పరచాలని, జీవో నెంబర్. 7 వెంటనే రద్దు చేయాలని, ఫీజు రియంబర్స్మెంట్ పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ ఉపాధ్యక్షులు బోయిని రాఘవేంద్ర ముదిరాజ్, కార్యదర్శి బాలస్వామి, విద్యార్థి యువజన విభాగం వర్కింగ్ సర్దార్ శ్రీను, రమేష్, గౌరీ శంకర్ తెలంగాణ రక్షణ వేదిక అధ్యక్షులు చింతల విజయ్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాసం సత్యనారాయణ, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్ గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రెండ్ నాయకులు బైరు శేఖర్, అయిలి వెంకన్న గౌడ్, ప్రముఖ



బీసీ ఉద్యమ నాయకులు రాయబండి పాండు రంగాచారి, కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నూరు శ్రీనివాసులు, తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు నకరికంటి శ్రీనివాస్ గౌడ్, నక్క మహేష్ యాదవ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం సభ్యులు లింగేష్ యాదవ్, బీసీ ప్రభంజనం కన్వీనర్లు ఉప్పు సత్యనారాయణ, జాల రాధా కిషన్, వెంకన్న, పలువురు బీసీ, విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులు, ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## ఎర్రకుంట చెర్వు కట్ట తిరిగి పునరుద్ధరణ



**యాచారం, మే 11 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని ధర్మన్నగూడా గ్రామంలో సర్వే నంబర్ 155లో ఉన్న కాకతీయుల కాలం నాటి చారిత్రక ఎర్రకుంట చెరువు కట్టను స్థానిక భూస్వాములు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే ఆదివారం సిపిఎం పార్టీ బృందం ద్వాంసం చేసిన చెర్వు కట్టను పరిశీలించిన తర్వాత స్థానిక తహసీల్దార్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుక పోయి గ్రామ పంచాయతీ ముందు ధర్నాకు పిలువు ఇవ్వడం తో అధికారులు వెంటనే స్పందించి ధ్వంసం చేసిన చెర్వు కట్టను చూడటం జరిగింది ఈ సందర్భంగా భూస్వాములు దిగివచ్చి ధ్వంసం చేసిన చెర్వు కట్టను తిరిగి పునరుద్దరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అంజయ్య,మండల కమిటీ సభ్యులు బాల్ రాజ్ మాజీ సర్పంచి ఎం భాషయ్య మాజీ వైస్ ఎంపీపీ ఎం శ్రీమన్నారాయణ, గ్రామశాఖ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ నిరసన
- పోలీసులకు వినతిపత్రం




**ఫరూఖ్‌నగర్, మే 11 (జనం సాక్షి) :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై మైనర్ బాలికకు మద్యం త్రాగించి అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఈ ఘటనను నిరసిస్తూ షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేయడం జరిగింది. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బండి సంజయ్ మధ్య ఉన్న రాజకీయ దోస్తీ కారణంగానే చర్యలు ఆలస్యమవుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని నాయకులు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ పార్టీ అధ్యక్షులు నటరాజన్, లక్ష్మణ్ నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి రవి యాదవ్, కౌన్సిలర్లు గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, జూపల్లి శంకర్, మాజీ ఎంపీటీసీ బిశ్వ రామకృష్ణ, నాయకులు బిక్షపతి, రాఘవేందర్, నడికూడ అశోక్, అజ్వార్, మినాజ్, షబ్బీర్, ఇర్ఫాన్, రఘు, తేజ, నాని తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పథకంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు



**చేవెళ్ల, మే 11 (జనంసాక్షి) :** పీఎం శ్రీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని చేవెళ్ల మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ దేవర మనీషా అనంతరెడ్డి తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎం శ్రీ పథకం కింద రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో అదనపు తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఫర్నిచర్‌తో పాటు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంచనలతతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యను అభ్యసించే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు మరింత ప్రయోజనం పొందుతారని ఆమె అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయాలి

- రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం
- అధికారుల మధ్య సమన్వయం లేదు
- నామమాత్రంగా మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**ధారూర్, మే 11 (జనంసాక్షి) :** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకపోతే ఎలా అని ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని రైతులకు పంట సహాయం చేస్తే లేరు. రైతుబంధు సక్కగా ఇస్తలేరు. సరిపడ్డ యూరియా ఇవ్వడం లేదు. కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేస్తలేరు. అంటే రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందో ప్రజలకు అర్థం అవుతుందని వికారాబాద్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.సోమవారం నాడు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్. వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ గారితో ఫోన్ లో మాట్లాడి,రైతులు పండించిన పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...రైతుల నుండి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులలో సమన్వయ లోపం ఉందని మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో వారం క్రితం ప్రారంభించిన వడ్ల కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు రైతుల నుండి ఒక గింజ కూడా కొనలేదు.ప్రశ్నిస్తే హమాలీలు లేరని నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నరాని రైతుబంధు ఎగొట్టి,యూరియా సరఫరా చేయడంలో విఫలమైన ఈ చేతగాని ప్రభుత్వం రైతన్న ఎంతో కష్టపడి పండించిన పంటను కూడా కొనలేని దౌర్భాగ్యపు పరిస్థితుల్లో ఉందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను పెట్టి పంట కొనుగోలు చేసిన ఘనత కెసిఆర్ గారిదని కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కాకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొక్కజొన్న,జొన్న మరియు వడ్లు కొనుగోలు చేయాలని రైతులు ఎక్కడికక్కడ రహదారులపైకి వచ్చి రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు.అధికారులను ప్రశ్నిస్తే త్వరలో కొనుగోలు చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మండి పడ్డారు.ఇప్పటికే చాలామంది రైతులు వర్ష సూచన,నిలువ చేసుకునే స్థలం లేని పలు కారణాల వల్ల తాము పండించిన పంటను అత్యంత తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని గతంలో మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి తో కలిసి మండలంలో నాగుసన్ పల్లి మరియు తరిగోపుల గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న,జొన్న కొనుగోలు చేయాలని కోరడం జరిగింది. ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు పరిస్థితి మారలేదని రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం అమ్ముకున్నాక ఏదో నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెట్టడం సరికాదు.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేలుకుని ప్రతిపక్షాల పైన దృష్టి పెట్టడం మాని సకాలంలో స్పందించి రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని కోరుతున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనకు పక్కా చర్యలు చేపట్టాలి



**అల్వాల్, మే 11 (జనంసాక్షి) :** వర్షాకాలం దృష్ట్యా నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అల్వాల్ ప్రాంతంలో పర్యటించి, చిన్నరాయుడు చెరువు పరిసరాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లో దోమల ఉత్పత్తిని తగ్గించేందుకు ఆయిల్ బాల్స్ వినియోగంతో పాటు, కాలనీల్లో నిరంతరం ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లు, డీఈఈ సత్యనారాయణ, ఎంటమాలజీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12 మే 2026

# తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- ధాన్యం రాశుల దగ్గర రైతుల పడిగాపులు
- జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు పూర్తిగా విఫలం
- జిపిఎస్ ట్రాకింగ్ ప్రకారం జిల్లాలో వాహనాల సంఖ్య వెల్లడించాలి
- బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



**చిన్నంబావి, మే 11 (జనం సాక్షి) :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తరుగు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నంబావి మండలం వెలుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని రాచాల యుగంధర్ గౌడ్ సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా వరి ధాన్యం పండించే రైతులు వెలగొండ గ్రామంలో ఉన్నారన్నారు. దాదాపు నెల రోజులుగా రైతులు పండించిన ధాన్యాన్ని ఐకెపి కేంద్రానికి అమ్మకానికి తెచ్చారని, నెలరోజులవుతున్నా నేటికీ ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. రైస్ మిల్లర్లు ఒక్కో క్వింటాలుకు 5 కిలోల తరుగు తీస్తామని డిమాండ్ చేస్తుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత మండలంలోనే ఈ విధంగా ఉంటే జిల్లాలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గతంలోనే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఒక సెక్టార్ కు 40 చొప్పున వాహనాలు చూపించి ధాన్యం రవాణా టెండర్ పొందిన కాంట్రాక్టర్లు జిల్లాలోని తొమ్మిది సెక్టార్లకు సంబంధించిన 360 వాహనాలు ఎక్కడున్నాయని నిలదీశారు. పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నాం అనుకుంటే జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా 360 వాహనాలను చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో తూర్పు పట్టే యంత్రాలు లేవని, లోడింగ్ చేయడానికి వాహనాలు రావడంలేదని సాకులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై తగు చర్యలు తీసుకోవాలని, అట్టి మిల్లులను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే తరుగు లేకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐకెపి కేంద్రాన్ని గత రెండు సంవత్సరాలుగా నడుపుతున్న సభ్యుల పేర్ల మీద అకౌంటు లేదని, గతంలో కొనసాగిన సభ్యుల పేరు పైనే నేటికీ అకౌంటు ఉండడం వల్ల కష్టం ఒకరు చేస్తే ఫలితం మరొకరికి దక్కుతుందని, వెంటనే వారి పేరుపై అకౌంట్ ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుట్టలయ్య, బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్, నాయకులు రామన్ గౌడ్, పెద్ద బొడ్డయ్య , వెంకటస్వామి గౌడ్, అశోక్, సుదర్శన్ రెడ్డి, నాగరాజు, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, పరమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ



**బెజ్జంకి, మే 11 (జనం సాక్షి) :** మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మానకొండూరు శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు.మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రూ.60 లక్షల నిధులతో నూతనంగా మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు.అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు,రూ.6 లక్షల నిధులతో హైస్కూల్‌లో నిర్మించిన వంటగదిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా,మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కడివెరుగు ప్రవీణ్,తహసిల్దార్ శ్రీకాంత్,ప్రిన్సిపల్ శ్వేత,ఏఈ సాయికిరణ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ,ఏఎంసీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ ముక్కిస రత్నాకర్ రెడ్డి,మండల నాయకులు లింగాల శ్రీనివాస్,భైర సంతోష్,గుంద్రాల బాల్ నరసింహారెడ్డి,పూర్మ నారాయణరెడ్డి,ఐలేని శ్రీనివాస్ రెడ్డి,సాదిక్,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి


- కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక
- సర్వేపై ఎన్యూమరేట ర్లకు కీలక సూచనలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 11 (జనం సాక్షి) :** జనగణన-2027 మొదటి రోజు సర్వేలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక సందర్శించారు. బ్లాక్ నంబర్ 62, 63 పరిధిలో సర్వే చేస్తు న్న తీరును ఆమె స్వయంగా పరిశీలించి, విధివిధానాల గురించి ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమరేటర్లకు పలు కీలక సూచనలు చేశారు. మ్యాపింగ్ సర్వేలో భాగంగా మొదటి మూడు రోజులు సంబంధిత ప్రాంతం యొక్క మ్యాపును కచ్చితంగా గీయాలని, అందులో ప్రధాన ల్యాండ్ మార్క్స్ (గుర్తు చిహ్నాలను) స్పష్టంగా గుర్తించాలని సూచించారు.డిజిటల్ ఎంట్రీ భవనాల గణన,గృహాల సంఖ్యను ముందుగా యాప్‌లో నమో దు చేసిన తర్వాతే ఇంటింటి సర్వేకు వెళ్లాలని స్పష్టం చేశారు.పారదర్శకత సర్వే నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పకడ్బం దీగా గణన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈఓ, ఎన్యూమరేటర్ అంబ్రేష్, సెక్టోరల్ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట, మే 11 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పునరుద్ఘాటించారు. ఇటీవల కాలంలో విడుదలైన ఇంటర్ మీడియట్ వార్షిక ఫలితాలలో శివ్వంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించరని గుర్తు చేస్తూ, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికీ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలను సాధించడం అభినందనీయమని, అందుకు కృషి చేసిన అధ్యాపకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఆమె అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట కళాశాలకు పక్క భవనం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, అధ్యాపకులు గంగాధర్, యాదయ్య, ప్రభాకర్, పేనిల్, నాగమణి,శ్రీలత, బాబు, కృష్ణ, కరుణాకర్, శంకర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలకు చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

- రూ. 10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి
- సర్పంచ్ భర్త కూడా అరెస్టు.. సిద్దిపేట జిల్లాలో కలకలం

**కొమురవెల్లి, మే 11 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్త ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. డ్రైనేజీ పైప్‌లైన్ తొలగింపు కోసం డిమాండ్ ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను అక్కడ నుంచి తొలగించాలనే అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ (AO-1) పది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సోమవారం పక్కా ప్రణాళికతో అధికారులు నిఘా పెట్టారు. సర్పంచ్ భర్త ద్వారా నగదు స్వీకరణ సోమవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే లంచం డబ్బులు తీసుకుంటుండగా అధికారులు దాడి చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి అంజనేయులు (A-2) ఆ పది వేల రూపాయలను స్వీకరించారు. ఏసీబీ అధికారులు వారిద్దరినీ పట్టుకుని, వారి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరు పరచనున్న అధికారులు విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి, అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించినందుకు గాను పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, సర్పంచ్ భర్త అంజనేయులును అధికారులు అరెస్టు చేశారు. వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుపై ప్రస్తుతం తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.



### అవినీతిపై ఫిర్యాదు చేయండి

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ దాడిలో ఏసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 11 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలలనుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భూ భారతి 17 ,పెన్షన్ 10, హౌసింగ్ 6,ఇతర 36 మొత్తం 67 దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తు పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ శ్రీనివాసరావు, డి ఆర్ ఓ అంబదాసు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట బ్యూరో, మే 11 (జనంసాక్షి) :** సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి కలెక్టరేట్ పక్కనగల ఈవీఎం గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ కలియ తిరిగారు. లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలీస్ అధికారులు 24/7 గట్టి బందోబస్తు నిర్వహించాలని అలాగే ఈవిఎం గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చెయ్యాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# మెదక్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

- పట్టణంలో పలు సమస్యలను పరిష్కరించండి
- మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 11 (జనం సాక్షి) :** మెదక్ లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని ఈ విద్యాలయం ద్వారా నిరుపేద విద్యార్థులకు సీబీసీ సిలబస్ తోపాటు మంచి విద్యను అందించాలని అలాగే మెదక్ పట్టణంలో వివిధ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ మెదక్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో కలెక్టర్ ప్రతిమ సింగ్ కు వినతి పత్రములు సమర్పించడం జరిగిందని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ లో కేంద్రీయ విద్యాలయ పాఠశాలను ప్రారంభించాలని, స్టేడియంలో తాగునీటి సౌకర్యం మూత్రశాలలను ఏర్పాటు చేయాలని, మెదక్ పట్టణంలో డిగ్రీ కళాశాల, ధ్యాన్ చంద్ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్ , నర్సాపూర్ చౌరస్తా , మెడికల్ కళాశాల , మాత శిశు సంరక్షణ కేంద్రాల వద్ద బస్ షెల్టర్లను నిర్మించాలని మరియు మెదక్ పట్టణంలో గల మల్లెం చెరువు, గో సముద్రం, పిట్లం చెరువు ఎఫ్ టి ఎల్ ను నిర్ధారించి ఆక్రమణలను తొలగించాలని, రాయిన్ పల్లి చెరువు నుండి మెదక్ పట్టణంలో గల చెరువులకు వచ్చే నీటిపారుదల కాలువలకు సిమెంట్ లైనింగ్ చేయాలని, కాళేశ్వరం లో భాగంగా శంకరంపేట మండలంలోని కాలువలను పూర్తి చేసి చెరువులను నింపేటటువంటి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ గారి కి తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ సిటిజన్ ఫోరం సభ్యులు పి.డీ. ఆనందం, బాలేష్ గౌడ్, కానుగు రాజశేఖర్, రామ్ కిషన్, డి. జీవరత్నములు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్



**కోహెడ, మే 11 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని బాదుగుల చెరువు , ఊరగుట్ట ప్రాంతంలో గల ఐకెపి కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన వరి ధాన్యం కొనుగోలు లో వేగవంతం చేసి వెంటనే కొనుగోలు పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరి కోతలు పూర్తిగా కాగా వరికోసి ఒక నెల రోజులు గడిచినప్పటికీ రైతుల వరి ధాన్యాలు కళ్ళంలో నే ఉండడం చాలా అన్యాయమని వెంటనే కొనుగోలు పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని అయన ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. వరి మద్దతు ధర 20 రూపాయలు తగ్గించి కూడా ఎందుకు కొనుగోలు చేయడం లేదు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏ గ్రేడ్ వడ్లను బి గ్రేడ్ గా తీసుకుంటున్న మిల్లర్లు వరి ధాన్యం కటింగ్ పేరుతో మిల్లర్లు తాలు, మట్టి, అవుట్ టర్న్, వెయిట్ లాస్ పేరుతో కటింగ్ చేస్తున్న మిల్లర్లు 41 కిలో 100 గ్రాములు 200 గ్రాములు వరి ధాన్యం తూకం వేసినప్పటికి తక్కువగా వస్తుందని మిల్లర్లు తెలియజేస్తున్నారని అనడం దారుణం అని అన్నారు. రైతులను నట్టేట ముంచడం చాలా అన్యాయం అని అన్నారు. ఐకెపి, మిల్లర్ల తూకంలో తేడా ఎలా వస్తుందా ఐకెపి సెంటర్లో కాంటకు తాళాలు వేసింది. అధికారులే కదా అలాంటప్పుడ ఎందుకు హెచ్చుతగ్గులు వస్తున్నాయి అని ఆయన అన్నారు. ఈ కోతల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఐకెపి సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలి. లారీ మిల్లుల వద్ద అన్లోడ్ చేస్తున్నప్పుడు ఒక్కొక్క లారీకి దిగుమతి విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారి డీసీ ఎస్ ఓ తో చారవాణి ద్వారా మాట్లాడి తెలుసుకోవడం జరిగింది. వర్షాలు వచ్చే పరిస్థితిలు ఉన్నందువలన కొనుగోలు వేగవంత చేయాలని కోరడం జరిగింది. సిద్దిపేట జిల్లాలో రోజుకు ఐదు నుంచి 6 మెట్రిక్ టన్ల వరి కొనుగోలు జరుగుతుంది చెప్పడం జరిగింది. జిల్లాలోని 420 ఐకెపి సెంటర్లోని వివిధ సమస్యలను వెంట వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారని అన్నారన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు రాని పరిస్థితుల్లో ట్రాక్టర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోహెడ గ్రామంలో కొందరు రైతులు డీసీఎం వ్యానులో వరి ధాన్యాన్ని మిల్లర్లకు తీసుకపోవడం జరుగుతుంది. ఈ యొక్క డీసీఎం చార్జీలు రైతు భరించవలసి ఉంటుంది. తర్వాత రైతుల అకౌంట్లో ఈ డబ్బులు జమ అవుతాయని తెలపడం అధికారులు తెలిపారని రైతు తెలియజేశారన్నారు. వర్షాలు పడే పరిస్థితులు ఉన్నందువలన వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పొరపాటు లేకుండా గృహ గణనను పూర్తి చేయాలి



**ఇటిక్యాల, మే 11 (జనం సాక్షి) :** జనగణన కార్యక్రమంలో భాగంగా మొదటి దశ గృహ గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేపట్టాలని ఇటిక్యాల తహశీల్దార్ శ్రీకాంత్ రెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని మునగాల గ్రామ పంచాయతీలో గృహ గణన ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు జరిగే ప్రోగ్రాంలో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటి యజమానులతో సరైన సమాధానం రాబట్టి ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆయన సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

# నగరాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



- హార్టికల్చర్, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, రంగసముద్రం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**వరంగల్ ఎంజీఎం, మే 11(జనంసాక్షి):** నగరాభివృద్ధి పనులలో మరింత వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చాహత్ వాజ్‌పాయి సోమవారం నగరంలోని పలు అభివృద్ధి, పారిశుధ్య, హార్టికల్చర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మొదటగా నాయుడు పెట్రోల్ బంక్ నుంచి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ వరకు సెంట్రల్ మీడియన్‌లో నాటిన మొక్కలు, వాటి నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పోస్తూ, కలుపు మొక్కలను తొలగించి సమర్థవంతంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణలో హార్టికల్చర్ విభాగం కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం మట్టేవాడ, రామన్నపేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. 26వ డివిజన్‌లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వీల్ బ్యారోలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకుంటూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉర్సుగుట్ట వద్ద ఉన్న రంగసముద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫోర్‌షోర్ బండును తనిఖీ చేశారు. ఇరిగేషన్ మరియు పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు సంయుక్తంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. రంగసముద్రం డీసిల్టేషన్ కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఈఈ సంతోష్ బాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నకిలీ విత్తనాల నియంత్రణ, ఫార్మర్ రిజిస్ట్రీ, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, నానో యూరియా వినియోగంపై అవగాహన తదితర అంశాలపై వ్యవసాయ, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల నియంత్రణ కోసం మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన బృందాలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు, జిల్లా స్థాయిలో పోలీస్, వ్యవసాయ శాఖలతో పాటు విత్తన కంపెనీల ప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరిగితే సంబంధిత డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ పచ్చి రొట్ట ఎరువుల వినియోగాన్ని పెంచాలని, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు 67 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ జరిగిందని పేర్కొంటూ, ప్రతిరోజూ పురోగతి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం సాగు సమయానికి రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, అధిక దిగుబడికి నాణ్యమైన విత్తనాల ఎంపిక కీలకమని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ పై బాగా ఫోకస్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఎస్పీ నరేష్ కుమార్, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ ఏఈఓలు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు, వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌లను కూడా తనిఖీ చేసి, ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత కోసం ఈవిఎంల భద్రత అత్యంత కీలకమని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పట్ల అశ్రద్ధ చేయొద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి దరఖాస్తుల పట్ల అశ్రద్ధ చేయొద్దని, సమస్యలను పరిష్కరించాలని అందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 65 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యల దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ, ప్రతినిధి మే 11 (జనం సాక్షి) :** విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, ఆహార సదుపాయాలు నాణ్యతతో ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలుర కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కిచెన్ షెడ్, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, డార్మెటరీలను పరిశీలించి, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, పప్పులు, బియ్యం తదితర ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, స్టోర్‌లో ఉన్న నిల్వలు మరియు రికార్డుల్లో నమోదైన వివరాల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత వార్డెన్ హాల్ సింగ్‌కు నోటీసు జారీ చేయాలని డీటీడీవో ప్రేమకళను ఆదేశించారు. హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారు. భోజనం, స్నాక్స్ సమయానికి అందుతున్నాయా, ఆహార నాణ్యత ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. అదేవిధంగా వారానికి ఎన్నిసార్లు చికెన్, మటన్, గుడ్లు అందిస్తున్నారో వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులకు అన్నారు. విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నర్సంపేట ఆర్డీవో ఆఫీసు డీఏవో శ్రీనివాస్ మృతి

- నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటు



**నర్సంపేట, మే 11 (జనం సాక్షి):** నర్సంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో)గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కార్యాలయంలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఉద్యోగ నిర్వహణలో ఉండగానే కుప్పకూలిపోవడంతో తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం విధుల్లో ఉన్న అధికారి ఒక్కసారిగా ప్రాణాలు కోల్పోవడంతో రెవెన్యూ శాఖ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారంరెవిన్యూ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగానే ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురై కుర్చీలోనే కుప్పకూలిపోయారు. గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్పందించి ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే శ్రీనివాస్ ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రెవెన్యూ సిబ్బంది సంతాపంశ్రీనివాస్ ఆకస్మిక మరణ వార్త తెలియడంతో నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, సమ్మక్క సహా డివిజన్‌లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిబద్ధత గల అధికారిని కోల్పోవడం బాధాకరమని సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- శాఖల వారీగా అందిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరిస్తూ నివేదిక సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ బ్యూరో, మే 11(జనం సాక్షి):** సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం, ఇతర వేదికల ద్వారా ప్రజల సమస్య పరిష్కారం నిమిత్తం సామాన్య ప్రజలు చేసుకున్న ప్రతి ఒక దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తక్షణమే పరిష్కరించి నివేదికను తమకు సమర్పించాలని, తమ పరిధిలో లేని పక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంతోపాటు తొర్రూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆ దరఖాస్తుల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ నుండి వచ్చిన ప్రజావాణి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాకేష్ మహబూబాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రజావాణి ప్రక్రియ యాప్ విధానాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ ను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, సత్వర సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అందువలన ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ తెవలు అందించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విత్తన సంస్థ సీడ్స్‌ను రైతులు వినియోగించుకోవాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి




**నిర్మల్ బ్యూరో, మే11,(జనంసాక్షి)** రాష్ట్ర విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, వారి ఉన్నతికి విత్తన సంస్థ పనిచేస్తుందని, డీలర్లు అందరూ ప్రభుత్వం తయారు చేసే విత్తనాలు రైతులు సాగు చేసుకునేలాగా ప్రచారం కల్పించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసే విత్తనాలు అన్ని నాణ్యతా పరంగా ఉత్తమమైనవి అని అన్నారు. ధర తక్కువ ఉండటంతో పాటుగా, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ విత్తనాల కంపెనీలు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్నాయని వివరించారు.

### విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ వల్ల రైతులకు లాభాలు: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాలు వల్ల రైతులకు చాలా లాభాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సంస్థ తయారు చేసే విత్తనాలు అన్ని ఎన్నో నాణ్యతా పరీక్షల తర్వాత విపణిలోకి వస్తాయన్నారు. ఈ విత్తనాలు సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందగలుగుతారని చెప్పారు. అలాగే నకిలీ విత్తనాల నుంచి కూడా రైతులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు అంజి ప్రసాద్, శ్రీధర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సమయానికి రారు.. వచ్చిన ఉండరు..

- జిల్లా కలెక్టరేట్ లో అధికారుల లీలలు
- తాళం వేసి ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారి ఆఫీస్
- మండిపడుతున్న పడుతున్న కెవిపిఎస్






**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లో అధికారుల లీలలు అంతాఇంతా కాదు.. సమయానికి ఆఫీసుకు రారు.. వచ్చిన ఉండరు.. వారినే అడిగే వారు కూడా ఉండరు.. దీంతో ఈ జిల్లాలో అధికారులు విలాసవంతమన జీవితాలకు అలవాటు పడ్డారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. సోమవారం కొందరు జిల్లా కలెక్టరేట్ లోని ఫుడ్ సేఫ్టీ అధికారి కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉండడం చూసి మండిపడ్డారు. ఇదేంటి ఈ కార్యాలయానికి సోమవారం కూడా సెలవేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఈ మేరకు సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆత్కూర్ శ్రీధర్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లో అధికారుల నిర్లక్ష్యం ఏ పాటికి చేరిందో తాళం వేసి ఉన్న ఫుడ్ సేఫ్టీ కార్యాలయం చూస్తే అర్థమవుతుందని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్య భద్రతను పర్యవేక్షించాల్సిన జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కార్యాలయానికి తాళం వేసి ఉండటం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోనే అధికారుల పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల గ్రామాలు, మండలాల్లో అధికారుల పనితీరు ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో లేకుండా తాళాలు వేసి తిరగడం దారుణమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు ఎన్నో ఆశలతో వస్తే, అధికారులు మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని విమర్శించారు. ఫుడ్ సేఫ్టీ శాఖ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన విభాగమని, కల్తీ ఆహారం, నాసిరకం పదార్థాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాల్లో లేకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందన్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు ఎవరు పట్టించుకుంటారో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం



**భీమిని, మే 11 (జనంసాక్షి) :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దపేట గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. అరికిల్ల. విజయ అనే మహిళకు చెందిన ఇల్లు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంట్లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. చుట్టుప్రక్కల నివాస ప్రజలు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు ఎక్కువ కావడంతో ఎండవేడికి దూరంగా ఉండి పోయినట్లు తెలిపారు. వెంటనే బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో పట్టణా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మహిళ గ్రామంలోని ఓ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. మంటల్లో ఇల్లు బూడిద కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్న తీరు ను చూసి గ్రామస్తులు చలించిపోయారు. కుటుంబ అవసరాల కోసం ఎకరం భూమి నీ విక్రయించగా రూ.10 లక్షలు వచ్చినట్లు నూతనంగా నిర్మించే ఇంటికి రూ.3 లక్షల వరకు ఖర్చు చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇంటి నిర్మాణం కొరకు డబ్బులు సరిపోకపోవడంతో బంధువుల దగ్గర మరో రూ. 5 లక్షలు అప్పుకు తెచ్చినట్లు తెలిపారు. ఇంట్లో దాచిన రూ.5 లక్షలు పూర్తిగా కాలిపోయిందన్నారు. తులం బంగారం, వెండి ఆభరణాల తో పాటు ఇద్దరు కొడుకులకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, విలువైన భూముల పాసుపుస్తకాలు పూర్తిగా బూడిద అయ్యాయని బోరున విలపించారు. ఇంటికి పెద్ద దిక్కు భర్త గత రెండేళ్ల క్రితం పాముకాటుకు గురై మృతి చెందడంతో ఇద్దరు కొడుకులను కాయ కష్టం చేస్తూ తల్లి చదివిపిస్తుందని పేర్కొన్నారు. ఇంట్లో వస్తువులన్నీ పూర్తిగ కాలిపోవడంతో కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిషన్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి అగ్నిమాపక అధికారి ఆర్.సత్యనారాయణ, సిబ్బంది ప్రభాకర్, రమేష్, మహేష్ లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట

- కుబీర్ ఏపీఎంకు వీఓఏ సంఘం నోటీసు!



**కుబీర్, మే 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్త వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా, ఈ నెల 18వ తేదీ నుండి నిర్మల్ జిల్లావ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ ఐకెపి వీఓఏల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం కుబీర్ మండల ఏపీఎంకు సమ్మె నోటీసును అందజేస్తూ సంఘం నాయకులు ఈ విషయాన్ని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4న జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశ నిర్ణయం మేరకు, జిల్లా కమిటీ ఆదేశాలతో మండలంలోని వీఓఏలందరూ విధులను బహిష్కరించి శాంతియుత మార్గంలో పోరాడాలని నిర్ణయించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని, జిల్లాలోని వీఓఏలందరూ ఐక్యంగా పాల్గొనాలని అసోసియేషన్ నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఓఏల అధ్యక్షురాలు సవిత, కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, మే 11 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న 20 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో అర్హులైన ఉద్యోగులు ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.బదిలీలు, ప్రమోషన్ల కోసం ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తే వారిపై శాఖపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 32 దరఖాస్తులు, డిపిఓకు 5, డిడబ్ల్యుఓకు 3, డిఆర్డిఏకు 2, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**● ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



**సూర్యాపేట, మే 11 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో చివ్వెంల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గాయం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మొగ్గాయిగూడెం గ్రామ సర్పంచ్ ధారవత్ కృష్ణ,ఉప సర్పంచ్ బానోతు రాజుతో పాటు పలువురు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రాజకీయంగా గుర్తించి వారికి అవకాశాలు కల్పించిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు.నేడు అనేక మంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడటానికి కాంగ్రెస్ పార్టీ కృషే కారణమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఘనతేనని అన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.చందుపట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు కొండల్, ఉప సర్పంచ్ హరికృష్ణ, ముద్ద వెంకన్న, కొండేటి ఉపేందర్, లక్ష్మణ్, రమేష్, నవీన్, మండల కాంగ్రెస్ నాయకులు దుబ్బాక ప్రభాకర్ రెడ్డి, భూక్య అనిత,మట్టపల్లి సైదులు, కృష్ణయ్య గౌడ్, బాల్ రెడ్డి, పులితండా సర్పంచ్ సుశీల రమేష్, గాయంవారిగూడెం సర్పంచ్ రాము, గుర్రం తండా సర్పంచ్ వినోద్, గుంజలూరు సర్పంచ్ బొల్లికొండ సైదులు, వట్టి ఖమ్మంపహాడ్ ఈదయ్య, మండల బీసీ సెల్ అధ్యక్షులు ఎల్కాపల్లి వెంకన్న, మాజీ ఎంపిటిసి శ్రీను,బొప్పాని లలిత్ తదితరులు పాల్గొన్నారు.

# గృహగణన ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేయాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



**మోటకొండూరు, మే 11 (జనంసాక్షి) :** జనగణన – 2027 మొదటి దశ గృహగణన (హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్) కార్యక్రమంలో బాగంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం మోటకొండూరు మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో సూపర్ వైజర్ లు నిర్వహిస్తున్న గృహగణన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఎల్‌బీ ( హౌస్ లిస్టింగ్ బ్లాక్) సరిహద్దుల నిర్ధారణ, ఇంటింటి సమాచారం సేకరణ, మ్యాపుల ఆధారంగా ఫీల్డ్ వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులకు, ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. గృహగణనలో ఎలాంటి ఇళ్ల మినహాయింపు, డూప్లికేషన్ లేదా ఓవర్‌ల్యాపింగ్ జరగకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సరైన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. గృహగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తిచేయడం ద్వారా భవిష్యత్ ప్రణాళికలు మరియు సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగకరమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు.అలాగే స్థానిక ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది,మోటకొండూరు మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ



**హుజూర్‌నగర్, మే 11 (జనంసాక్షి) :** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించామని హుజూర్ నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 35 దరఖాస్తులను ఆర్డీవో స్వీకరించారు. రెవిన్యూ సమస్యలు ప్రధానంగా భూ సమస్యలు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలపై పలువురు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి కరస్పాండెంట్, మే 11 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో రెవిన్యూ శాఖ 47, జిల్లా పంచాయతీ 8, పంచాయతీరాజ్ 3, ఎస్సీ డెవలప్మెంట్ 3, గ్రామీణ అభివృద్ధి శాఖ 2, విద్యాశాఖ 2, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2 హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ , సర్వే ల్యాండ్స్, మైన్స్, ఫిషరీస్, వ్యవసాయ ,జిల్లా సంక్షేమ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, కొన్ని శాఖలు ఉద్యోగుల వివరాలు అందేజెయలేదని, అట్టి శాఖల ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని , ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**● ఇసుక సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ అర్బన్, మే 11 (జనం సాక్షి) :** ఇసుక రవాణా విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత.సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇసుక వాహనాల రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద టీజీఎండిసి అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు కలెక్టర్ అనుమతించారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**నిజామాబాద్ అర్బన్, మే 11 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 77 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈ నివర్తి, ఎస్.హెచ్.ఓ విజయ్ బాబు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, ఈ నెల 15న రాష్ట్ర సమాచార కమిషన్ హాజరవుతున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబర్చిన బాలబాలికలను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

**● జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 11 (జనం సాక్షి) :** ప్రజావాణి అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు.అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు.సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 165 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇట్టి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# అంగవైకల్యం భారం కాదు



**నిజామాబాద్ అర్బన్, మే 11 (జనం సాక్షి) :** అంగవైకల్యం భారం కాదని, వారికి సేవ చేసే భాగ్యంగా భావించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సమగ్ర శిక్ష, విద్యాశాఖ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పిల్లలకు అంగ వైకల్యం ఉందని బాధపడొద్దన్నారు. భవిత కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అంగ వైకల్యం ఉన్న విద్యార్థులకు భగవంతుడు ఏదో ఒక ప్రతిభను ఇస్తాడన్నారు. లూయిస్ బ్రెయిలీ, అంద సంగీత మేధావి రవీంద్ర జైన్, దివ్యాంగ నృత్య కళాకారిని సుధాచంద్రన్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొందరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి లేఖనందిస్తానని తెలిపారు. అనంతరం 393 మంది విద్యార్థులకు 34 లక్షల విలువ గల ఉపకరణాలను అందజేశారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిఇఓ అశోక్, ఎంఈవో లు సాయారెడ్డి, ఎన్ఆర్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, ఆ లింకో ప్రతినిధులు డాక్టర్ ప్రత్యూష్, 39 వ డివిజన్ కార్పొరేటర్ జ్యోతి మురళి, బీజేపీ నాయకులు ప్రభాకర్ పవన్ ముందడ, కైరం కొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

# విలీనంతో పాటు నూతన జీతభత్యాలు చెల్లించాలి



**ముషీరాబాద్, మే 11 (జనం సాక్షి) :** ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం తో పాటుగా 2021 పే స్కేల్,2026 జూన్ 1 నుండి నూతన జీత భత్యాలుచెల్లించాలని తెలంగాణ రోడ్ ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్ బహుజన కార్మిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనతో పాటుగా బహుజన కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మునిరాములు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాములు కార్మిక నాయకులు సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ కార్యాలయంలో టీజీ ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ని కలిసి రాష్ట్ర మంత్రులు ప్రభుత్వ అధికారులు సమ్మె జరుగుతున్న సమయాన్ని తొందరగా స్పందించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలు పరిష్కరించేందుకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమ్మె విరమింపజెసినందుకు చూపిన ప్రత్యేక చొరవకు గాను ఆర్టీసీ ఎండి కు ప్రత్యేక ధన్యవాదాలుతెలుపుతూ, డ్రైవర్ కండక్టర్ల ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటుగా ఆర్టీసీ సమ్మెకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కత్తుల యాదయ్య మాట్లాడుతూ సమ్మె కాలంలో ప్రాణ త్యాగం చేసిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రతి ఆర్టీసీ ఉద్యోగి నుండి రూపాయలు 300 రికవరీ చేసి ఇప్పించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ విలీనం తర్వాత తార్నాక హాస్పిటల్ వైద్య సేవలు యధాతతంగా కొనసాగించాలన్నారు. ఉద్యోగులతల్లిదండ్రులకు తార్నాక హాస్పిటల్ తో పాటుగా ప్రవేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు కూడా వైద్య సదుపాయం కల్పించాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందన సభలో ఇచ్చిన హామీ పై స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. దశరథ, వి లింగయ్య, వెంకయ్య రాధిక, రేణుక, కేజీయమ్మ, అన్నపూర్ణ, కే జంగయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి**
**● అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 11 (జనంసాక్షి) :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ చంద్రావతితో కలిసి మొత్తం 134 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ఎంతో వ్యయప్రయాసలతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపైనా ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎటువంటి ఆలస్యం జరగకుండా చూడాలని, తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా అర్జీదారులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పురోగతిని పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# స్థిరాస్తి రంగంలో సాంకేతిక విప్లవం

- వ్యయ ఒత్తిళ్లు, కఠిన నిబంధనలే కారణం
- ఫిక్కీ-కేపీఎంజీ నివేదిక

**న్యూఢిల్లీ:**డిజిటల్, డేటా ఆధారిత సాంకేతికతలను మన దేశ స్థిరాస్తి రంగం వేగంగా అందిపుచ్చుకుంటోందని ఫిక్కీ-కేపీఎంజీ నివేదిక తెలిపింది. పెరుగుతున్న ఖర్చులు, కఠినమైన నియంత్రణ సంస్థల నిబంధనలే ఇందుకు కారణమని వెల్లడించింది. 'రీఇమాజినింగ్ ఇండియాస్ రియల్ ఎస్టేట్ ల్యాండ్‌స్కేప్- ది రోల్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ వాల్యూ చెయిన్ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరిట ఈ సంయుక్త నివేదికను సంస్థలు వెలువరించాయి. 2025 నాటికి దేశ స్థిరాస్తి మార్కెట్ విలువ 650 బిలియన్ డాలర్లు (సుమారు రూ.61.10 లక్షల కోట్లు)గా ఉండగా, 2047కి 5.8 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.545 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్స్), ఇన్విట్‌ల ద్వారా ఇప్పటికే 16 బి.డాలర్ల (సుమారు రూ.1.50 లక్షల కోట్ల)కు పైగా నిధులు ఈ రంగంలోకి వచ్చాయి.సాంకేతికత అవసరాలకు ప్రధాన కారణాలు: నిర్మాణ సామగ్రి, ఇతర ఖర్చులు పెరుగుతున్న తరుణంలో, నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవాలని కంపెనీలు భావిస్తున్నాయి. కఠినమైన నియంత్రణ నిబంధనలు, నిర్మాణంలో నిర్దేశిత గడువులను పాటించడం కంపెనీలకు కష్టతరంగా మారుతోంది. అంతర్జాతీయ, సంస్థాగత పెట్టుబడుదారులు కంపెనీల నుంచి పారదర్శకతను ఆశించడం కూడా కారణమే. ప్రస్తుత తరం గృహ కొనుగోలుదార్లు, డిజిటల్ పద్ధతుల్లో సమాచారాన్ని పొందుతూ, మెరుగైన వివరాలను కోరుకుంటున్నారు. స్థలం ఎంపిక, డిజైన్, నిర్మాణ పద్ధతులు, అమ్మకాలు, ఆస్తుల నిర్వహణ వంటి ప్రతి దశలోనూ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోంది. కాగితం ఆధారిత పాత పద్ధతుల నుంచి కంపెనీలు ప్రస్తుతం ప్రాప్‌టెక్ వైపు మళ్లుతున్నాయి. భారతీయులు ఆస్తుల కొనుగోలును కేవలం ఒక లావాదేవీగా కాకుండా, అన్వేషణ నుంచి డాక్యుమెంటేషన్, ఫైనాన్సింగ్ వరకు సరళమైన డిజిటల్ ప్రయాణంగా మారాలని అభిలషిస్తున్నారని స్క్వేర్ యార్డ్స్ సహవ్యవస్థాపకుడు హితేశ్ సింగ్లా అభిప్రాయపడ్డారు. సాంకేతికత వల్ల అసంఘటితంగా ఉన్న స్థిరాస్తి రంగంలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెరుగుతున్నాయని వివరించారు.



# భారీ నష్టాల్లోనే సూచీలు

## ఇరాన్ వార్, పొదుపు చర్యల ప్రభావం..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. శాంతి ఒప్పందానికి ఇరాన్ ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించడం, చమురు ధరలు మళ్లీ పెరగడం వంటి కారణాలు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీనికితోడు ప్రధాని మోదీ ప్రకటించిన కొన్ని పొదుపు చర్యలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,850 దిగువన ముగిసింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.467 లక్షకు కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 76,638.09 (క్రితం ముగింపు 77,328.19) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,957.40 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1312.91 పాయింట్ల నష్టంతో 76,015.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 360.30 పాయింట్ల నష్టంతో 23,815.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.34గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, ఇండిగో, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. సన్‌ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా, యాక్సి?స్ బ్యాంక్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4666 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


**కారణాలు ఇవీ..**

అమెరికాతో ఇరాన్ చెలగాటం ఆడుతోందని, ఇరాన్ ప్రతి పాదనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ఆ దేశ శాంతి ప్రతిపాదనలను ట్రంప్ తోసిపుచ్చారు. అమెరికా అసాధ్యమైన డిమాండ్లు చేస్తోందని ఆరోపిస్తూ.. అగ్రరాజ్య ప్లాన్‌ను ఇరాన్ తిరస్కరించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు విఫలమవ్వడం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగతాయన్న ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాడకాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మార్కెట్‌పై ప్రభావం చూపింది. ఆర్థిక వృద్ధిని, కార్పొరేట్ ఆదాయాలను దెబ్బతీస్తుందని నిపుణులు భావిస్తున్నారు.అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105 డాలర్లకు చేరడం ప్రభావం చూపింది. దిగుమతులపై ఆధారపడే మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రతికూల అంశం కావడం గమనార్హం.డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95 డాలర్ల స్థాయికి పడిపోయింది. దీనికితోడు విదేశీ పెట్టుబడులు తరలిపోవడమూ ప్రభావం చూపింది.

# ఈవీ, బ్యాటరీ టెక్నాలజీల్లో రూ.8,500 కోట్ల పెట్టుబడులు

## టాటా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సన్నాహాలు


**న్యూఢిల్లీ:**విద్యుత్ వాహనాలు (ఈవీ), బ్యాటరీ సాంకేతికత రంగాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు దిగ్గజ సంస్థలు టాటా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌లు వేర్వేరుగా సన్నాహాలు చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలూ ఈ విభాగంలో పెడుతున్న పెట్టుబడుల మొత్తం 900 మిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఉంటుందని సమాచారం. ఈ రంగాల్లో ఆధిపత్యం వహిస్తున్న చైనా సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా మన దిగ్గజ సంస్థలు ముందడుగు వేస్తున్నాయి. టాటా గ్రూప్‌నకు చెందిన బ్యాటరీ విభాగం అగ్రతాస్, బెంగళూరులో కొత్త పరిశోధన, అభివృద్ధి కేంద్రం కోసం 400 మి.డాలర్ల (రూ.3,800 కోట్ల)కు పైగా పెట్టుబడి పెట్టనుంది. ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న లిథియం ఐరన్ ఫాస్పేట్, లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్పేట్ సాంకేతికతలను దేశీయంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టనుంది. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, మహారాష్ట్రలో రీసెర్చ్ హబ్ ఏర్పాటు చేయడానికి వచ్చే 5-6 ఏళ్లలో కనీసం 500 మి.డాలర్ల (రూ.4,700 కోట్ల) పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది. కీలక లక్ష్యాలివే: విద్యుత్ వాహనాల్లో ఖరీదైన, క్లిష్టమైన భాగం బ్యాటరీ. చైనా తన సాంకేతికతను పంచుకోవడంలో ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో, భారత కంపెనీలు తమ సొంత మేధో సంపత్తిని సృష్టించుకోవాలని భావిస్తున్నాయి. అంతర్జాతీయ ఆటోమోటివ్ టెక్నాలజీని మన దేశ రహదారులు, వాతావరణం, ధరలకు అనుగుణంగా మార్చడమే జేఎస్‌డబ్ల్యూ రీసెర్చ్ కేంద్రం ప్రధాన లక్ష్యం.




# 'నీ గుట్టు బయటపెడ్తా'..

## ఇంజినీర్‌కు క్లాడ్ మోడల్ బ్లాక్‌మెయిల్!

**న్యూఢిల్లీ:**హీరో ఏళ్ల తరబడి కష్టపడి ఓ రోబోను తయారుచేస్తే.. తీరా అది హీరోయిన్‌పై మనసు పారేసుకుంటుంది. దాని ప్రవర్తన నచ్చక హీరో దాని అడ్డు తొలగించుకోగా.. అది ఓ విలన్ చేతికి చిక్కుతుంది. ఆ తర్వాత దానికి రెడ్ చిప్ అమర్చడంతో నానా బీభత్సం సృష్టిస్తుంది. కొన్నేళ్ల క్రితం వచ్చిన రోబో చిత్ర కథ ఇదీ. సాంకేతికత పక్కదారి పడితే జరిగే పరిణామాలను ఈ సినిమా కళ్లకు కట్టింది. ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌కూ అలాంటి పరిస్థితే ఎదురైంది. తన క్లాడ్ మోడల్స్‌ను పరీక్షించినప్పుడు ఏఐ మోడల్ ప్రవర్తించిన తీరును తాజాగా ఆ సంస్థ బయటపెట్టింది. తమ ఇంజినీర్‌ను ఏఐ మోడల్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు పేర్కొంది.ఆంత్రోపిక్ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది క్లాడ్ ఓపస్ 4ను ఒక కాల్పనిక పని వాతావరణంలో పరీక్షించినప్పుడు ఈ విషయం బయటపడింది. ఏఐ మోడల్‌ను ఒక ఉద్యోగి క్రియేట్ చేశారు. అప్పటి వరకు ఇచ్చిన టాస్కులను చేసుకుంటూ వచ్చిన ఏఐ.. దాన్ని షట్‌డౌన్ చేస్తామని, మరో ఏఐ మోడల్‌తో రీప్లేస్ చేస్తామని సంకేతాలు ఇచ్చినప్పుడు తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. తన వద్ద ఉన్న సున్నితమైన సమాచారాన్ని బయటపెడతానని ఇంజినీర్‌ను బెదిరించింది.



వాస్తవానికి ఆ ఇంజినీర్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు పేర్కొన్న ఇ-మెయిల్ కూడా ఆంత్రోపిక్ సృష్టే. ఏఐ మోడళ్ల నైతిక విలువలను పరీక్షించే క్రమంలో ఈ వ్యవహారం బయటపడింది.నెగిటివ్ క్యారెక్టర్లను, తనను తాను రక్షించుకోవాల్సిన సందర్భంలో తిరుగుబాటు చేయడం వంటి అంశాలను ఇంటర్నెట్ ద్వారా సదరు ఏఐ మోడల్ నేర్చుకున్నట్లు గుర్తించామని ఆంత్రోపిక్ తెలిపింది. తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఈ ప్రయత్నం చేసిందని తెలిపింది. దీంతో ఆంత్రోపిక్ తన ఏఐ మోడళ్లకు ఇచ్చే శిక్షణ విధానంలో మార్పులు చేసింది. నైతిక విలువలను బోధించడం ముఖ్యమని భావించింది. దాని ఆధారంగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. విలువలతో నడుచుకోవడం, మనుషులకు సహాయకారిగా ఉండడంపై మాత్రమే శిక్షణలో భాగంగా చేర్చింది. ప్రస్తుతం ఉన్న క్లాడ్ హైకూ 4.5 వంటి సరికొత్త మోడల్స్ ఇలాంటి తప్పుడు ప్రవర్తనను అసలు చూపించలేదని తెలిపింది.

# బంగారం కొనుగోళ్లు ప్రధాని మోదీ ఎందుకు వద్దంటున్నారు?



న్యూఢిల్లీ:ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధాని మోదీ పౌరులకు పిలుపునిచ్చారు. తద్వారా విదేశీ మారకం నిల్వలను భారీగా ఆదా చేయొచ్చని పేర్కొన్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిం చుకోవాలని, పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని సూచించారు. విదేశీ మారకపు నిల్వలు కాపాడుకోవడానికి పలు పొదుపు చర్యలను ప్రధాని ప్రస్తావించినప్పటికీ.. వివాహాలు, ఇతర ఫంక్షన్ల కోసం కుటుంబాలు ఏడాది వరకు బంగారాన్ని కొనకూడదని పిలుపునివ్వడం అందరి దృష్టినీ ఆకర్షించింది.
బంగారం ఎందుకంత కీలకం? కొనుగోళ్లు ఆగితే విదేశీ మారకం నిల్వలు ఎలా ఆదా అవుతాయి?

**అత్యధికం ఈ రెండే**

భారతదేశం తన అవసరాలకు కావాల్సిన 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. బంగారం కూడా భారీగా దిగుమతి అవుతోంది. ఏటా 700-800 టన్నుల బంగారం వినియోగిస్తుంటే అందులో దేశీయంగా ఉత్పత్తి అయ్యేది పరిమితమే. అంటే 90 శాతానికి పైగా బంగారం దిగుమతి చేసుకుంటున్నాం. బంగారం, ముడి చమురుకు అమెరికన్ డాలర్లలోనే చెల్లింపులు చేయాలి. అంటే మనం ఎంత ఎక్కువగా ఈ రెండూ దిగుమతి చేసుకుంటే ఆమేర మన ఖజానాలోని విదేశీ మారకపు నిల్వలు బయటకు వెళ్తాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగి, భారత రూపాయి విలువ పడిపోతుంది.
బంగారం ఎందుకు కీలకం
బంగారం కొనుగోళ్లను వాయిదా వేయమనడం ద్వారా అనవసరమైన కొనుగోళ్లను తగ్గించడం ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. అందుకే బంగారం దిగుమతులు తగ్గించాలని భావిస్తోంది. సాధారణంగా పారిశ్రామిక ఉత్పత్తికి, పసిడికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదు. అదే పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడితే దాని ప్రభావం వస్తూత్పత్తి మీద పడుతుంది. ఒకవేళ కొనుగోళ్లను నిరుత్సాహపరిచేందుకు ధరలు పెంచితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది. పైగా రూపాయి విలువ తగ్గితే, దిగుమతి చేసుకునే వస్తువుల ధరలన్నీ పెరుగుతాయి. దీనివల్ల సామాన్యుల పైనా భారం పడుతుంది. అదే బంగారం కొనుగోళ్లు తగ్గితే రూపాయి స్థిరంగా ఉంటుంది. కాబట్టి దిగుమతుల బిల్లు తగ్గించుకోవడం కోసం బంగారం కొనుగోళ్లను వాయిదా వేయడమే ప్రత్యామ్నాయ మార్గం.

**గతంలో ఏం చేశారు?**

బంగారం దిగుమతులపై ప్రభుత్వం ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచుతుంది. దిగుమతులు అసాధారణంగా పెరిగిన సందర్భాల్లో నియంత్రించేందుకు గత ప్రభుత్వాలు కొన్ని చర్యలు చేపట్టేవి. బంగారంపై విధించే సుంకాలను భారీగా పెంచడం, దిగుమతులపై ఆంక్షలు, సావరిన్ గోల్డ్ బాండ్స్ వంటి ప్రత్యామ్నాయ పథకాలను తీసుకురావడం వంటివి చేశాయి.

**ఇప్పుడే ఎందుకు?**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఎప్పుడు చల్లారుతాయో తెలియని పరిస్థితి. దీంతో చమురు ధరలు అమాంతం పెరిగాయి. అంతేకాదు సరఫరా గొలుసు అవరోధాలు ఏర్పడతాయన్న ఆందోళనలూ ఉన్నాయి. దీంతో వర్ధమాన దేశాల కరెన్సీలు ఒత్తిడికి లోనవుతున్నాయి. ఇరాన్- అమెరికా వార్ సందర్భంగా రూపాయి విలువ కూడా ఇటీవల భారీగా పతనమైంది. ఈ క్రమంలోనే దిగుమతుల బిల్లు తగ్గితేనే ఆ మేర రూపాయి స్థిరత్వం సాధించడం సాధ్యమవుతుంది. అందుకే బంగారం కొనుగోళ్లు వద్దంటూ ప్రధాని మోదీ పేర్కొనడం గమనార్హం.

### బంగారం కొనొద్దన్న మోదీ..

# పసిడి షేర్లు భారీగా పతనం

ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో అస్థిరత నేపథ్యంలో బంగారం ధరలు పెరుగుతున్నాయని.. ఏడాది పాటు కొనుగోళ్లను నిలిపివేద్దామని ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పసిడి దిగుమతులు తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందన్నారు. దీంతో సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో గోల్డ్ స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. టైటాన్ కంపెనీ షేర్ 6 శాతానికి పైగా పడిపోయి రూ.4,230కి చేరింది. ఇది మునుపటి ముగింపు ధర కంటే రూ.283.40 తక్కువ కావడం గమనార్హం. దీంతోపాటు కల్యాణ్ జ్యువెలర్స్, సెంకో గోల్డ్ వంటి స్టాక్‌లు భారీగా పడిపోయాయి.మోదీ ప్రకటనపై దేశంలోని బంగారు వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఆయనతో చర్చించడానికి మే 12న ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లనున్నట్లు జ్యువెలరీ అసోసియేషన్ వెల్లడించింది. ప్రపంచంలోనే బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. ప్రతి ఏడాది సుమారు 700-800 టన్నుల పుత్తడిని ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. కానీ దేశీయంగా కేవలం 1-2 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ బంగారు దిగుమతులు రికార్డు స్థాయిలో 72 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెరిగిన వస్తువుల ధరలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులలో అనిశ్చితి వల్ల భారత్ తన విదేశీ మారక నిల్వలపై ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఇటీవల భారతదేశ విదేశీ మారక నిల్వలు 7.794 బిలియన్ డాలర్లు తగ్గి 690.693 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఆ ప్రభావం దేశ ఆర్థికవ్యవస్థపై పడే అవకాశం ఉంది.
మోదీ ఏమన్నారంటే..

# ఇక వారానికి 48 గంటలే పని

కేంద్ర ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లలో 'వేతనాల కోడ్ 2019' అనేది అత్యంత ముఖ్యమైన మొదటి కోడ్. ఈ వేతనాల కోడ్‌లోని సెక్షన్ 9 అనేది కేంద్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో 'ఫ్లోర్ వేజ్' (కనీస ప్రాథమిక వేతనం)ను నిర్ణయించే చట్టపరమైన అధికారాన్ని ఇస్తుంది. దీని ప్రకారం, దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాలకు వేర్వేరు కనీస వేతనాలను కేంద్ర సర్కారు నిర్ణయించొచ్చు.ఫ్లోర్ వేజ్ నిర్దిష్ట తుది మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదు. ఒక సెంట్రల్ అడ్వైజరీ బోర్డు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే దీనిపై తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది. కేంద్రం ఒకసారి ఫ్లోర్ వేజ్‌ను ప్రకటిస్తే, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ రాష్ట్ర కార్మికులకు అంతకంటే తక్కువ కనీస వేతనాన్ని నిర్ణయించడానికి వీలు ఉండదు. రాష్ట్రాలు తమ పరిధిలో కనీస వేతన చట్టాలను చేసేటప్పుడు కేంద్ర ఫ్లోర్ వేజ్‌ను ఒక ప్రాథమిక బెంచ్‌మార్క్‌గా కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

**కార్మిక సంఘాల వాదన ఇదీ**

2700 క్యాలరీల ఆహారం, దుస్తులు, ఇల్లు, పిల్లల చదువుల ప్రాతిపదికన కార్మికుల కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో ప్రతిపాదించారు. అయితే ఈ లెక్కింపు సూత్రాన్ని, గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నియమాల నుంచి తొలగించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కనీస వేతనానికి కచ్చితమైన ఫార్ములా అనేది లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు కార్మికుల వాస్తవ ఖర్చులను పట్టించుకోకుండా, ఏకపక్షంగా తక్కువ వేతనాన్ని నిర్ణయించే ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే రకమైన శ్రమకు ఒకే విధమైన కనీస వేతనం ఉండాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు ఫ్లోర్ వేజ్‌లను నిర్ణయిస్తే, అది వెనుకబడిన రాష్ట్రాల కార్మికులను మరింత పేదరికంలోకి నెట్టడమే అవుతుందని వాదిస్తున్నాయి. నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో కనీస వేతనాన్ని ఎలా లెక్కించాలి అనే దానిపై స్పష్టమైన ఫార్ములాను, ప్రమాణాలను పేర్కొంది. కానీ, తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నిబంధనలలో ఆ లెక్కింపు సూత్రాన్ని ప్రభుత్వం తొలగించింది. దీనికి బదులుగా, కనీస వేతన ప్రమాణాలను భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక లేదా సాధారణ ఉత్తర్వు ద్వారా విడిగా ప్రకటిస్తుందని స్పష్టంచేసింది. కనీస జీవన ప్రమాణం, దుస్తులు, గృహవసతి వంటి వాటితో పాటు సముచితంగా భావించే ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం కొత్త వేతన నిబంధనలు చెబుతున్నాయి.

# మనం దాచాలి.. విదేశీ మారకద్రవ్యం సంపాదించాలి

## మోదీ సందేశానికి మద్దతుగా కేంద్రమంత్రులు



విదేశీమారక ద్రవ్యాన్ని హరించే ఖర్చులను తగ్గించుకోవాలని ప్రజలు, పరిశ్రమ వర్గాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ కోరారు. అంతర్జాతీయంగా తీవ్ర అస్థిర పరిస్థితులను నెలకొన్న సమయంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారన్నారు. సోమవారం సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో మంత్రి మాట్లాడారు."పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. శాంతి ఒప్పందం ఎప్పుడు కుదురుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో ప్రజలు విదేశీ మారకద్రవ్యాన్ని హరించే ప్రతి ఖర్చునూ తగ్గించుకోవడం ముఖ్యం. విదేశీ మారక ద్రవ్యాన్ని పరిరక్షించుకోవడానికి మన ప్రయత్నం చేద్దాం. దానిని కాపాడుకోవడానికి మాత్రమే పరిమితం కావొద్దు. ఎక్కువ సంపాదించాలి. ఈ రెండు పనులు సమాంతరంగా జరగాలి" అని వైష్ణవ్ పేర్కొన్నారు. అలాగే, మరో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇదే విధంగా స్పందించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మోదీ ఆ పిలుపు ఇచ్చారన్నారు. ప్రయాణాల్లో భాగంగా ప్రజారవాణాను వినియోగించాలని, ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో ప్రయాణించడాన్ని నివారించాలని సూచించారు.పశ్చిమాసియా ఉద్రికత్తల వేళ.. నిత్యావసరాలు, ఇంధన సరఫరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, సరఫరా గొలుసు అంతరాయాలను నివారించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అంతరాజతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో, ప్రపంచ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు ఎంతో ఉపకరిస్తుందన్నారు. పశ్చిమాసియాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఏర్పాటు చేసిన గ్రూప్ సమావేశంలో భాగంగా మంత్రి ఈ విధంగా స్పందించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాడకాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలంటూ మోదీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. బంగారం దిగుమతులు తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందని, విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లు తగ్గించుకోవాలని దేశ ప్రజలను మోదీ కోరారు. నిత్యావసరాల్లో స్వదేశీ వస్తువులే ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, వాటినే వినియోగిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని అడిగారు. ఈ కొవిడ్ తరహా చర్యల ప్రస్తావనపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలోనే కేంద్రమంత్రులు స్పందిస్తున్నారు.

# స్వల్ప తేడాతో ఓడిపోతే ఫలితపై తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చు

అవి పరిష్కరించకుండానే ఎన్నికలు జరిగాయని పేర్కొంది. వేలల్లో పెండింగ్‌లో ఉన్న 31అసెంబ్లీ స్థానాల్లో కొన్ని వందల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యామని వెల్లడించింది. ఒక నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోయారని టీఎంసీ పేర్కొంది. ఆ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా నుంచి 5,000కు పైగా పేర్లు తొలగించారని ఆరోపించింది. రాష్ట్రంలో తమ పార్టీకి- భాజపాకు మధ్య మొత్తం ఓట్ల తేడా సుమారు 32 లక్షలు ఉండగా.. ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళు35లక్షలకు పైగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి అవకతవకల వల్లే ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయంది. టీఎంసీ వాదనలపై సుప్రీం కోర్టు స్పందిస్తూ.. ఓట్ల తొలగింపులు చేపట్టిన ప్రాంతాల్లో స్వల్ప తేడాతో పార్టీ ఓడిపోతే దానిపై తిరిగి దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ బాధితులకు ఉంటుందని పేర్కొంది. అటువంటి స్థానాలలోని ఓటర్లు లేదా పార్టీలు కొత్త దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అటువంటి కేసులను తాము పరిశీలిస్తామంది.

# డీఎంకే నాయకుడు స్టాలిన్ ఇంటికెళ్లిన విజయ్

ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ప్రమాణస్వీకారం మిస్ అయిన మంత్రి కీర్తన..**

టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకురాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.

# బండి సంజయ్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

- మైనర్‌ను రేప్ చేసిన వ్యక్తికి చట్టం నుంచి మినహాయింపులా?
- బాధితురాలి పైనే కేసులు పెడతారా
- బండి సంజయ్‌ని కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరాఫ్ చేయాలి
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్




**ముషీరాబాద్, మే 11 (జనం సాక్షి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాంనగర్ చౌరస్తా వద్ద బండి సంజయ్, ఆయన కుమారుడు భగీరథ్ ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ మైనర్ బాలికను అఘాయిత్యం చేసిన ఘటనలో పోలీసులు నిందితులపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదై 48 గంటలు గడుస్తున్నా భగీరథ్ ను అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారని మండిపడ్డారు. ఈ ఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసు నమోదైతే పేద ప్రజలకు ఒక న్యాయం, అధికారం లో ఉన్న వారికి మరొక న్యాయం ఉంటుందా అన్నారు. కుమారుడిని రక్షించేందుకు బాధిత కుటుంబాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన కేంద్రమంత్రి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. కేంద్ర బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై హోం మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితో సహా,మంత్రులు స్పందించడంలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి, కుమ్మక్కు రాజకీయాలకు ఈ ఘటన నిదర్శనమన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం మూడు నెలలుగా తిరుగుతుంటే ఈ రాష్ట్రంలో పట్టించుకునే వారు లేరని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.పోలీసులు భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహా, డివిజన్ ల అధ్యక్షులు బల్ల శ్రీనివాస్ రెడ్డి,కొండ శ్రీధర్ రెడ్డి, శంకర్, రాకేష్, నాయకులు ముఠా నరేష్, ముచ్చకృతి ప్రభాకర్,ఆకుల అరుణ్ బొట్టు శ్రీను, వల్లాల శ్రీనివాస్ యాదవ్, సుధాకర్ గుప్తా, దీన్ దయాల్ రెడ్డి, గోక నవీన్, గోరఖ్నాథ్, మాధవ్,రవి యాదవ్, నేత శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్, అస్లాం ,హరీష్, తదితర నాయకులు పాల్గొన్నారు.




# మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

- రానున్న 15 రోజులు కీలకం..సమన్వయంతో కొనుగోళ్ల ప్రక్రియ
- మిల్లర్లు, రవాణా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ బ్యూరో, మే 11 (జనంసాక్షి) :** ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులలో దిగుమతి ప్రక్రియ వేగవంతం చేసి కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, రైస్ మిల్లర్స్, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అన్నారు. తద్వారా కొనుగోలు రవాణా ప్రక్రియలో మరింత వేగం పెరుగుతుందని తెలిపారు. అధికారులు, మిల్లర్లు, రవాణాదారుల సమన్వయంతోనే కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయగలమని అన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగానికి మిల్లర్లు సాధ్యమైన మేర ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, రానున్న రెండు వారాల్లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాల్సి ఉంటుందని, అందుకు తగిన రీతిలో అందరూ సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డిఓ మహేశ్వర్, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, డిఆర్డి ఓ శ్రీధర్, డిసిఓ రామానుజాచారి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.


# చేర్యాలలో పట్టపగలు దొంగల బీభత్సం

**తలుపులు పగులగొట్టి 6 తులాల బంగారం చోరీ**

**చేర్యాల మే 11 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలో పట్టపగలు దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా ఎంచుకొని పట్టపగలే దోపిడీకి పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. పట్టణంలోని గడితోట కాలనీలో సోమవారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చొరబడి ఆరు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడితోట కాలనీకి చెందిన పిట్టల శ్రీనివాస్ అనే రైతు సోమవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు, ఇదే అదునుగా భావించి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలో భద్రపరిచిన 6 తులాల బంగారం, రూ. 50 వేల నగదును అపహరించుకుపోయారు. ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన శ్రీనివాస్, తలుపులు పగులగొట్టి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సొమ్ము మాయం కావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్సై గూడ అపూర్వరెడ్డి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు ఆధారాలను సేకరించారు. బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు తీసుకోవాలి

**జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్,మే11(జనంసాక్షి) :** రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, హైడ్రా గుర్తించిన 30 సమస్యాత్మక పాయింట్లలో ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో 15 ప్రాంతాలు, మిగతా సర్కిళ్లలో మరో 15 ప్రాంతాలు నీరు నిలిచే సమస్య ఉన్నట్లు తెలిపారు. నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో హైడ్రా రాజేంద్రనగర్ జోనల్ ఇంచార్జీ మహేష్, జీహెచ్ఎంసీ ఇంచార్జ్ ఎస్ఈ నరేందర్ గౌడ్, ఈఈ వెంకట శేషయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# మైనర్లకు మద్యం అమ్మకాలు..

- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- తలకొండపల్లి సంతోషిమాత వైన్స్‌కు నిబంధనలు జాంతానై



**తలకొండపల్లి మే11(జనంసాక్షి):** మండల కేంద్రంలోని సంతోషి మాత వైన్స్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులకు భారీగా మద్యాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ప్రతి ఊరిలో బెల్టు దుకాణాలను తెరిచి అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఆటోల ద్వారా కూరగాయలు విక్రయించినట్లుగా మద్యం సీసాలను బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారు.ప్రతి ఊరిలో రెండు నుంచి 15 వరకు బెల్టు షాపులు ఏర్పడ్డాయి.అయినా అధికారులు చోద్యాన్ని చూస్తూ,తమకేమీ తెలియనట్లుగా పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మైనర్లకు మద్యం అమ్మకాలు జరపడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనర్లకు మద్యాన్ని అమ్మిన వైన్స్ షాపుపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.

# రాష్ట్రం అభివృద్ధికి విద్య, వైద్యం, ఉపాధి రంగాలు ఎంతో కీలకం

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక : ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళ




**హయత్ నగర్, మే 11 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో మెగా జాబ్ మేళా ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మాల్ రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి లు ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలనలో నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తూ డిఈఈటి, టాస్క్, ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో నిరుద్యోగ భృతిని భర్తీ చేసే విధంగా జాబ్ మేళా ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. నిరుద్యోగులకు జాబ్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు . ప్రభుత్వ ఉద్యోగాలలో గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను నిర్వహించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్నారు. గత ప్రభుత్వాలు నిర్వహించలేని పరిస్థితి, ఈ జాబ్ మేళాలో సుమారు 117 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 4000 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. చదువుకున్న ప్రతి విద్యార్థి చిన్న జాబా పెద్ద జాబా అని తేడా లేకుండా ఒక ఉద్యోగం పొందాలని, మీ అనుభవం ప్రకారం ఆరు నెలల తరువాత నిర్ణయం తీసుకునే అవకాశం మీలో రావాలి, ఆ విధంగా మీరు ఎదగాలి అని ఈ సందర్భంగా తెలియజేశారు. జాబ్ మేళా నిర్వహిస్తున్న కంపెనీల విధానాల గురించి యువతకు తెలియజేశారు. డిఈఈటి (డిజిటల్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్) టాస్క్ , తెలంగాణ అకాడమిక్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ల ఆధ్వర్యంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొనుటకు శిక్షణను అందిస్తు ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం లభిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లు అని తెలియజేశారు. నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశమే ప్రభుత్వ సంకల్పమని తెలియజేశారు. ఎస్ఎస్సి నుండి పీజీ వరకు చదువుకున్న విద్యార్థులు ఈ జాబు మూలాలో పాల్గొన్నారు." రైట్ పర్సన్స్ రైట్ ఉద్యోగం" ఉద్యోగం కల్పిస్తామని, వారి అర్హతను బట్టి ఉద్యోగ కల్పన ప్రతి కంపెనీ కల్పిస్తుందని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ప్రతి స్టాల్ ను సందర్శించి, మీకు తగిన ఉద్యోగాన్ని సంపాదించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ చేసుకుంటారని ఆశిస్తున్నాను. మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ, ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగం సంపాదించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనె ఉద్దేశం విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న రేవంత్ రెడ్డి అని ఈ సందర్భంగా తెలియజేశారు. హెచ్ఆర్ సొల్యూషన్స్ కంపెనీ నుండి అలేఖ్య బి బి ఏ చదువుతున్న విద్యార్థి 25 వేల జీతంతో మంత్రి చేతుల మీదుగా ఆఫర్ లెటర్ అందుకున్నారు. అదేవిధంగా ప్రియాంక, చందన్ నాయక్, తదితరులు మంత్రి చేతుల మీదుగా ఆఫర్ లెటర్‌ను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, టాస్క్ డైరెక్టర్ నితిన్, డి ఈ ఈ టి డైరెక్టర్, జిల్లా అధికారులు, జిల్లా అన్ని శాఖల అధికార యంత్రాంగం, జాబు మేళకు వచ్చేసిన వివిధ కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**ప్రజా ప్రభుత్వం ప్రజాసేవ కోసమే : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కథలాపూర్, మే 11(జనం సాక్షి) :** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ మండలం తండ్రియాల గ్రామంలోని ఫంక్షన్ హాల్ లో అర్హులైన కథలాపూర్ మండల పరిధిలోని 90 మంది లబ్ధిదారులకు రూ.90 లక్షల 10 వేల విలువైన కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, అలాగే రూ.7 లక్షల 87 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజాసేవకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలోని మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఏఎంసి చైర్మన్ డైరెక్టర్లు మండలంలోని ఉన్న పలు హోదాల నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# హుజురాబాద్‌లో త్వరలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు

**ప్రణవ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

**హుజురాబాద్, మే 11 (జనం సాక్షి ) :** హుజురాబాద్ ప్రధాన ఆసుపత్రిలో త్వరలో ట్రామా కేర్ సెంటర్ ప్రత్యేక విభాగం ఏర్పడబోతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ ట్రామా సెంటర్ రహదారి వెంబడి ప్రమాదాలు జరిగినప్పుడు త్వరితగతిన స్పందించి క్షతగాత్రులను తక్షణ చికిత్స అందించడానికి ఉపయోగపడుతుందని, వరంగల్,కరీంనగర్ ప్రధాన పట్టణాలకు మధ్యన హుజురాబాద్ ఉండడం వల్ల ఈ సెంటర్ రావడం చాలా ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహాతో ఇటీవల పలుమార్లు చర్చించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గంలో వైద్య రంగంలో అనేక నూతన మార్పులు తీసుకొచ్చి పేదలకు సరైన సమయంలో వైద్య సేవలు అందిస్తున్నామని ప్రణవ్ పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికులకు భారీ ఊరట

- మెడికల్ బోర్డు పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్
- కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం-యాజమాన్యం సానుకూలం
- ఐఎన్‌టియుసి నేతల చర్చలు ఫలించాయి



**గోదావరిఖని, మే 10 (జనంసాక్షి):** సింగరేణి కార్మికుల్లో గత కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్మికుల ఆరోగ్యం, ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించడంతో కార్మికుల్లో ఆశాభావం నెలకొంది. ముఖ్యంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డు పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ లభించడం కార్మికులకు పెద్ద ఉపశమనంగా మారింది. ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్‌టియుసి నేతల బృందం ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వెం. నరేందర్ రెడ్డిలను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. అనంతరం సింగరేణి సీఎండీ ఎన్. బలరాం జ్యోతి బుద్ధ, డైరెక్టర్ (పీఏడబ్ల్యూ) గౌతమ్ పోట్రుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చలు జరిపారు. చర్చల్లో మెడికల్ బోర్డు పునరుద్ధరణ, పెరిక్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సొంత ఇంటి పథకం, ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు, మారుపేర్ల మార్పులు, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యలు, విజిలెన్స్ కేసులు, పెండింగ్ బకాయిల చెల్లింపు, కొత్త బొగ్గు గనుల ప్రారంభం వంటి ముఖ్య అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. యాజమాన్యం అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు డా. జనక్ ప్రసాద్ తెలిపారు. మెడికల్ బోర్డు పునరుద్ధరణకు యాజమాన్యం హామీ ఇవ్వడం, సొంత ఇంటి పథకం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి చర్చలు జరపడం వంటి అంశాలు కార్మికుల్లో ఆనందం నింపాయి. ఈ సమావేశాల్లో ఐఎన్‌టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐఎన్‌టియుసి నిరంతరం పోరాడుతుందని జనక్ ప్రసాద్ స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో 43 కిలోల తూకం అంగీకరించం

- రైతుల సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ
- తాలు-చెత్త లేకుండా నాణ్యమైన వడ్లు కొనాలి
- మిల్లర్లు ఇబ్బంది పెడితే ధర్నాకు సిద్ధం



**కరీంనగర్ బ్యూరో, మే 11 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే ప్రధాన ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలపై విస్తృత చర్చ జరిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులను నట్టేట ముంచిన తూకం కోతలు, తాలు–చెత్తతో రైతులు బాధపడ్డారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లుగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, తాలు–చెత్త లేకుండా, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతోందని తెలిపారు.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ విధానం వల్ల లారీలు కొనుగోలు కేంద్రాలకు చేరుకోలేకపోవడంతో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో ఒక్క ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కలెక్టర్‌ను కలిసి తప్పు–తాలు లేకుండా, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లారీల సంఖ్య పెంచి ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, ప్రతి మండలం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించాలని, రోజూ సమీక్షించేందుకు డాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే తాను స్వయంగా రైతులతో కలిసి ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. 43 కిలోల తూకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ మరో గంటలో మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రేపటి నుంచి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప్పుల అంజన్ ప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, కోల రమేష్, జవ్వాజి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనేదే ప్రభుత్వం లక్ష్యం

**పీఎం శ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 11 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనేది ప్రభుత్వం లక్ష్యమని అ ప్రకారమే సిఎం రేవంత్ రెడ్డి ముందుకు పోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాలిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలలో బాగంగా వేములవాడలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్య వారోత్సవాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాలలో వేసవి శిబిరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మరియు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు.రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్ పాఠశాల నిర్మాణం చేపడుతుందన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో విద్య అందిస్తమన్నారు. పూర్తిస్థాయి ఆంగ్ల మాధ్యమ బోధన ఉండటం వల్ల కార్పొరేట్ స్కూల్స్‌కు పోటీగా నిలుస్తోందన్నారు. ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్స్,స్మార్ట్ ల్యాబ్స్, మంచి మౌలిక వసతులు ఏర్పాటు చేశారని, ఇంటర్నేషనల్ స్కూల్ తరహాలో క్యాంపస్ అభివృద్ధి చేయడం ఈ స్కూల్‌కు పెద్ద ఆకర్షణగా మారిందన్నారు. విద్యతో పాటు క్రీడలు,వ్యక్తిత్వ వికాసం, టెక్నాలజీ ఆధారిత అభ్యాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నారని,ఈ స్కూల్‌ను తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్యకు నమూనాగా అభివృద్ధి చేస్తోందన్నారు.విద్య వారోత్సవాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. సోమవారం నుండి మే 25 వరకు కొనసాగే వేసవి శిబిరాల్లో విద్యార్థులకు కోడింగ్, కళలు, క్రీడలు,యోగా మరియు వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొన్నారు.




# మా గ్రామంలో బెల్ట్ షాపులో మద్యం అమ్మితే ఆత్మహత్య చేసుకుంటా...

**నారాయణఖేడ్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ మండలం సంజీరావుపేట గ్రామానికి చెందిన రూప అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి సోమవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని బెల్ట్ షాపుల వల్ల తన భర్త మద్యానికి బానిసై, ప్రతిరోజూ తమను శారీరకంగా వేధిస్తున్నాడని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. ఇంట్లో తినడానికి వస్తువులు లేవని అన్ని అమ్మివేసి మద్యం సేవిస్తున్నాడన్నారు. ఇంట్లోని రేషన్ బియ్యాన్ని కూడా అమ్ముకుని మందు తాగుతున్నాడని, రాత్రి వేళల్లో పిల్లలను మందు కోసం పంపిస్తూ వారి చదువును పాడు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు చదవకుండా చేస్తున్నాడని ఇంట్లో ఒక్క రూపాయి కూడా ఉండనివ్వడం లేదన్నారు. ఎక్సైజ్ అధికారులకు గ్రామానికి వచ్చిన పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారన్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని బెల్ట్ షాపులను బంద్ చేయించాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని ఆమె వేడుకున్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, (జనం సాక్షి):** మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత ముమ్మరం గా సాగుతోందని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 533 కొనుగో లు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 19,206 రైతుల నుంచి 90,685 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ఇందులో 8,326 మంది రైతులకు 96.42 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొను గోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించి, కొనుగోలు ప్రక్రియ వేగం పుంజుకునేలా చర్యలు చేపడుతున్నామని నిత్యానంద్ పేర్కొన్నా రు. రవాణా సమస్యలపై ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరుగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవం తం చేసి, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా ధాన్యం సేకరణ పూర్తి చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ హామీ ఇచ్చారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 12 మే 2026

# గ్రామీణ మహిళల జీవనోపాధి బలోపేతానికి మరో అడుగు

- పశుసంవర్ధక జీవనోపాధుల బలోపేతానికి సెర్ప్, పీవీఎన్ఆర్టీయూ మధ్య అవగాహన ఒప్పందం
- సాంప్రదాయేతర ఉపాధీ రంగాల్లో మహిళలకు ఆదాయ వనరులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, పశుసంవర్ధక ఆధారిత జీవనోపాధుల విస్తరణకు మరో కీలక అడుగు పడింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), పివి నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్ టీయూవీయూ) సోమవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చు కున్నాయి. హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ వంటి రంగాల్లో సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నైపుణ్య ఆధారిత ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా మహిళల ఆర్థిక స్థితిని బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు వెటర్నరీ యూనివర్సిటీ తో ఒప్పందాలు చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, సమాఖ్యలను మరింత బలోపేతం చేసి గ్రామీణ మహిళల్లో స్వావలంబన, సామూహిక భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు బ్యాంకు లింకేజీలు, రివాల్వింగ్ ఫండ్లు, సబ్సిడీల ద్వారా ఆర్థిక సౌకర్యాలు అందించనున్నట్లు వెల్లడించారు. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్), రుణాల ద్వారా పొట్టేళ్ల యూనిట్లు, గొర్రె, మేక పిల్లల నర్సరీలు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ మదర్ యూనిట్లు, పక్షుల యూనిట్ల ఏర్పాటు వంటి కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. పీవీఎన్ఆర్ టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. శరత్ చంద్ర మాట్లాడుతూ పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ రంగాల్లో సెర్ప్ మహిళలకు విశ్వవిద్యాలయం పూర్తి స్థాయి సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు పశుసంవర్ధక రంగం బలమైన ఆధారమని, స్వయం సహాయక సంఘాల మహిళలు సంప్రదాయ ఉపాధికి పరిమితం కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ఆదాయ వనరులు పెంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సెర్ప్, పీవీఎన్ఆర్టీయూ భాగస్వామ్యం ద్వారా గ్రామీణ మహిళలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణ, మార్కెట్ అవగాహన అందుతుందని తెలిపారు.

# బడి పేరుతో గుడి కూల్చివేతనా?

- గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి కాకతీయుల నాటి చారిత్రక శివాలయం కూల్చివేత
- లంకెబిందెల వేటలో 24 అడుగుల తవ్వకాలు
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 500 కోట్ల భారీ కుంభకోణం.. అన్నీ ఎక్సెస్ టెండర్లే..
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపణ
- అశోక్ నగర్‌లో ధ్వంసమైన మట్టికోట శివాలయం పరిశీలన



**నర్సంపేట/ఖానాపురం, మే 11 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేసిన 800 ఏళ్ల చరిత్ర గల కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సందర్శించారు. సోమవారం కూల్చివేతకు గురైన ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శివాలయ సందర్శన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగమే కాదు.. ఏకంగా గుడుల విధ్వంసం కూడా జరుగుతోందని ఆయన విమర్శించారు. ఆనాడు కేసీఆర్ మన ఊరు-మన బడి పెడితే రేవంత్ రెడ్డి దాన్ని అర్థాంతరంగా నిలిపేశారు. రేవంత్ రెడ్డి పుణ్యమా అని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి వంద శాతం రుణమాఫీ చేయకుండా మాట తప్పిన భారతదేశ తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆయనకు దేవుడంటే భయం లేదు, భక్తి లేదు. కేసీఆర్ యాదాద్రి లాంటి మహా పుణ్యక్షేత్రాలను నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం హైడ్రా పేరుతో పేదల ఇండ్లు, మసీదులు, చర్చిలు, ఇప్పుడు ఏకంగా గుడులు కూలగొడుతున్నాడని విమర్శించారు. విశాఖ పీఠం కూలుస్తా అని మొన్న అధికారులను పంపాడు. సీఎం అయిన కొత్తలో సెక్రటేరియట్ కు పోతే లంక బిందెలు దొరుకుతాయనుకున్నా అని రేవంత్ రెడ్డి అన్నాడు. ఆయన అనుయాయులతో కలిసి నిజాం భవనాల చుట్టూ గుప్త నిధుల కోసం బాగానే వెతికాడు. అక్కడ దొరకకపోయే సరికి ఇప్పుడు కాకతీయుల గుడుల మీద పడ్డాడు. అశోక్ నగర్ లో కాకతీయ గణపతి దేవుడు నిర్మించిన 800 ఏళ్ల నాటి అద్భుతమైన శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చేశారని ఆయన తెలిపారు. ఆలయ రక్షణ కోసం ఉన్న అతిపెద్ద మట్టి ఆనకట్టను తొలుచుకుంటూ వెళ్లి మరీ గర్భగుడిని ధ్వంసం చేశారు. రాత్రి 12 నుంచి 1 గంట మధ్య, చీకట్లో గర్భగుడి కింద ఏకంగా 24 అడుగుల లోతు భారీ గుంత తవ్వారు. స్కూల్ కట్టే పనైతే పగలు చేయొచ్చు కదా? అర్ధరాత్రి ఎందుకు తవ్వారు? గుప్త నిధుల వేటలో రేవంత్ రెడ్డి డైరెక్షన్ లోనే ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. ఇది గుప్త నిధుల కోసం జరిగిన తవ్వకమే అని పురావస్తు శాఖ జిల్లా అధికారి బుజ్జి ఈ నెల 7వ తేదీన కలెక్టర్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యా దు చేశారు. ఆర్కియాలజీ అధికారి కంప్లైంట్ ఇచ్చినా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ కాలేదు, మిషనరీ సీజ్ చేయలేదు, ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అంటే దీని వెనుక రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్నది స్పష్టం. బీఆర్ఎస్ హయాంలో ధరణిలో ఇది దేవాలయ భూమి గా ఉంటే.. కాంగ్రెస్ రాగానే భూభారతిలో రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిగా ఎట్లా మారింది? స్కూల్ కట్టడానికి చుట్టూ కావలసినంత స్థలం ఉంది. అసలు ఈ నియోజకవర్గంలో వేరే చోట జీవో వచ్చిన స్కూల్ ను ఇక్కడికి ఎందుకు మార్చారు. గుడి ఉన్నకాడ బడి కట్టొచ్చు, కానీ పోయిపోయి గుడినే కూలగొట్టడం ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. పురావస్తు శాఖ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధ్యులను అరెస్ట్ చేసి మిషనరీని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. 1958 చట్టం ప్రకారం వందేళ్లు దాటిన కట్టడాలు ఆర్కియాలజీ పరిధిలోకి వస్తాయి కాబట్టి, ఈ స్థలాన్ని తక్షణమే పురావస్తు శాఖకు అప్పగించాలని, అర్ధరాత్రి తవ్వకాల్లో బయటపడ్డ గుప్త నిధులు, లంక బిందెలు ఏ ప్రభుత్వ పెద్దల ఇళ్లకు పోయాయో సమగ్ర విచారణ జరగాలని కోరారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి స్కూళ్ల టెండర్లలో భారీ కుంభకోణానికి పాల్పడ్డారని, రాష్ట్రంలో 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పిలిస్తే.. అన్నీ 4.86 శాతం, 4.96 శాతం 4.99శాతం ఎక్సెస్ కే ఇచ్చారు. ఒక్క టెండర్ కూడా మైనస్ కు పోకుండా అన్నీ ఎక్సెస్ కే ఎట్లా పోయాయని విమర్శించారు. ఈ స్కూళ్ల టెండర్లలో ఏకంగా 494 కోట్ల ఒక లక్ష రూపాయల ఎక్సెస్ అమౌంట్ ద్వారా ప్రజాధనం లూటీ అయ్యిందని తెలిపారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ రద్దు చేసి, వెంటనే ఈ ప్రజాధనం లూటీని ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వినయ్ భాస్కర్, మాజీ ఎంపీపీలు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# బండి కుమారుడిని ఎందుకు అరెస్ట్ చేయరు?

- రేవంత్ కుమ్మక్కయ్యారన్న అనుమానం
- శాసన మండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు



**హైదరాబాద్, మే11 (జనంసాక్షి) :** బాలికపై లైంగికదాడి కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని శాసన మండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతిరోజూ దేశం కోసం, ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పే కేంద్రమంత్రి, తన కుమారుడు అఘాయిత్యం చేస్తే ఏమీ జరగలేదని వెనకేసుకు రావడం దారుణమన్నారు. పైగా ఇంత జరిగాక కూడా ఆయన ఏమీ ఎరుగనట్లు ప్రధాని సభలో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. 'బేటీ బచావో' అంటూ నినాదాలిస్తూ నీతి వాక్యాలు పలికే బీజేపీ నేతలు, తమ కేంద్రమంత్రి ఒక మైనర్ ఆడపిల్ల పట్ల చేస్తున్న కుట్రలను ఖండించాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోం శాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ కుమ్మక్కై ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ రవీందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఒక బాలికకు అన్యాయం జరిగితే న్యాయం చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, ఈ ఘటనపై న్యాయం కోసం ఉద్యమించి, దేశవ్యాప్తంగా అన్నిపక్షాల మద్దతు కూడగడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హెచ్చరించారు.

# బీబీపేట గ్రామ శివారులో చిరుత సంచారం

- లేగదూడ చంపడంతో రైతుల ఆందోళన

**సంగారెడ్డి, మే11 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం బీబీపేట గ్రామ శివార్లలో చిరుత పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో చిరుత కదలికలు ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తాజాగా ఓ రైతు పొలంలో లేగ దూడపై దాడి చేయడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. బీబీపేట గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలం వద్ద పశువులను కట్టేయగా.. అర్ధరాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసింది. ఈ దాడిలో ఒక లేగదూడ మృతి చెందింది. ఉదయం పొలానికి వెళ్లిన రైతు.. లేగ దూడ చనిపోయి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. చిరుత అడుగుజాడలను గమనించిన ఆయన వెంటనే గ్రామస్థులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారం ఉన్న మాట వాస్తవమేనని ద్రువీకరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. కల్హేర్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా ఊరికి సమీపంలోని పొలాల్లోకి వచ్చి పశువులను చంపుతుండటంతో, రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటేనే రైతులు వణికిపోతున్నారు.

# కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన

- విమానం టేకాఫ్ అవుతుండగా దగ్గరగా వెళ్లిన వ్యక్తి
- వ్యక్తిని లాగేసుకున్న విమాన ఇంజన్

**న్యూయార్క్, మే11 (జనంసాక్షి) :** అమెరికాలోని కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన జరిగింది. డెన్వర్‌లోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో రన్‌వే దాటుతున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా భద్రతా కంచెను దూకి విమానానికి అత్యంత సమీపంగా చేరుకున్నాడు. అదే సమయంలో టేకాఫ్ కోసం వేగం పెంచుతున్న ఎయిర్‌బస్ విమానం ఇంజిన్ అతడిని ఒక్కసారిగా లోపలకు లాగేసుకుంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడి శరీరం పైభాగం ఇంజిన్‌లో ఇరుక్కుపోవడంతో పరిస్థితి మరింత భయానకంగా మారింది. అనంతరం ఇంజిన్ నుంచి భారీగా మంటలు వెలువడ్డాయి. సమాచారం మేరకు ? ఈ ఘటన జరిగిన సమయంలో విమానం సుమారు గంటకు 139 మైళ్ల వేగంతో టేకాఫ్ దశలో ఉంది. ఈ దృశ్యాన్ని చూసిన విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్‌లో మనిషి కాళ్లు కనిపించడంతో పాటు పెద్ద శబ్దాలు, మంటలు వెలువడటంతో విమానంలో కలకలం రేగింది. తక్షణమే అప్రమత్తమైన సిబ్బంది టేకాఫ్‌ను నిలిపివేసి అత్యవసర చర్యలు చేపట్టారు. అనంతరం విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించాలి

- హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు



**హైదరాబాద్, మే 12 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాన్ని (జూన్ - 2) పురస్కరించుకొని నిమ్స్ ఆసుపత్రిలో సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఉచితంగా మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్ ను నిర్వహించాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరిలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు రాష్ట్ర సచివాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా నిమ్స్ ఆసుపత్రిలో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించాలని క్లబ్ పాలకమండలి మంత్రి దామోదర్ రాజనర్సింహకు చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు రెగ్యులర్ గా తమ హెల్త్ ను చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్ లో హెల్త్ చెకప్ కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినాను మంత్రి ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు, ప్రభుత్వానికి ప్రెస్ క్లబ్ పాలకమండలి కృతజ్ఞతలు తెలిపారు.

# సువేందు పీఏ హత్య కేసులో ముగ్గురు అరెస్టు

**కోల్‌కతా, మే11 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో పురోగతి సాధించారు పోలీసులు. బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం అర్ధరాత్రి వేళ బెంగాల్‌కు తరలించినట్టు సమాచారం. నిందితులలో ఒకరు టోల్ ప్లాజా వద్ద యూపీఐ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు చేయడంతో దర్యాప్తు అధికారులు వారి కదలికలను గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు బిహార్‌లోని బక్సర్‌కు చెందినవారు కాగా, మరొకరు యూపీలోని బల్లియా వాసి. అయితే.. అతను కూడా బక్సర్‌లోనే నివసిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా.. బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ నెల 6న రాత్రి.. సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. కోల్‌కతా నుంచి తన స్కార్పియో వాహనంలో వెళుతున్న చంద్రనాథ్‌ను దోరియా రహదారిపై హత్య చేశారు. ఆయన వాహనాన్ని ఓ కారు అకస్మాత్తుగా ఓవర్ టేక్ చేయగా బైక్‌పై ఉన్న నిందితులు కారు ఎడమవైపు నుంచి వచ్చి నేరుగా చంద్రనాథ్‌పై కాల్పులు జరపడంతో ఆయన మృతిచెందారు. ఈ ఘటనలో రథ్ డ్రైవర్‌కు కూడా బుల్లెట్ తగలడంతో గాయాలయ్యాయి. ఆయన్ను కోల్‌కతా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# వన్యప్రాణుల సంరక్షణలో భారత్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు

**భవిష్యత్ తరాల కోసం జీవవైవిధ్య పరిరక్షణ అత్యవసరం : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) :** వన్యప్రాణుల సంరక్షణ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగమని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. పులులు, చిరుతలు, ఆసియా సింహాలు, మంచు చిరుతలు వంటి పెద్ద పులి జాతుల సంరక్షణలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ముఖ్య పాత్ర పోషిస్తోందని అన్నారు. భవిష్యత్ తరాల భద్రత, అడవుల పరిరక్షణ కోసం వన్యప్రాణుల సంరక్షణ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నెహ్రూ జూ పార్కులో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్(ఐబీసీఏ) రెండు రోజుల వర్క్ షాప్ 'షేర్డ్ స్కైప్స్ - షేర్డ్ ఫ్యూచర్' అనే థీమ్ తో నిర్వహించారు. గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెహ్రూ జంతు ప్రదర్శనశాల దేశంలోని అతిపెద్ద, అత్యుత్తమ జంతు ప్రదర్శన పార్క్‌లలో ఒకటిగా నిలిచిందన్నారు. వన్యప్రాణుల సంరక్షణ, సంతానోత్పత్తి, ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఈ పార్క్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. 'షేర్డ్ స్కైప్స్ - షేర్డ్ ఫ్యూచర్' కార్యక్రమం ప్రకృతి, వన్యప్రాణుల పరిరక్షణ పట్ల దేశ, రాష్ట్ర నిబద్ధతను పునరుద్ఘాటిస్తోందన్నారు. భారతీయ సంస్కృతి ఎప్పటికప్పుడు ప్రకృతి, పర్యావరణం, వన్యప్రాణుల పట్ల గౌరవం, సమతుల్యత, సహజీవన భావనతో ముందుకు సాగిందని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం పర్యావరణ బాధ్యత మాత్రమే కాకుండా నాగరికతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. నెహ్రూ జులాజికల్ పార్క్ లో టైగర్ సఫారీ, అంతరించిపోతున్న జాతుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. మనుషులు, ప్రకృతి కలిసి నడిస్తేనే పర్యావరణ సమతుల్యత పునరుద్ధరించగలమని ఈ కార్యక్రమాలు చాటి చెబుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా గొప్ప జీవవైవిధ్యానికి నిలయమని గవర్నర్ పేర్కొన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ అభయారణ్యం వంటి పులి సంరక్షణ కేంద్రాలు రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని అన్నారు. హరితాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వన్యప్రాణుల భవిష్యత్తు నేటి మన సంకల్పాలపై ఆధారపడి ఉందని, సహజ వారసత్వ పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అడవులు పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం గవర్నర్ జువాలాజికల్ పార్క్ లో పెద్ద పులులు, ఇతర అటవీ జంతువులను పరిశీలించారు. ఈ సందర్భంగా జూలో ఏర్పాటు చేసిన అటవీ జంతు చిత్రాల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, పీసీసీఎఫ్(హెచ్‌వోఎఫ్ఎఫ్) డాక్టర్ సీ సువర్ణ, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) వినయ్ కుమార్, అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం భగవత్, పీసీసీఎఫ్(డెవలప్‌మెంట్) రత్నాకర్ జౌహరి, చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రియాంక వర్గీస్, కేంద్ర విదేశీ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# 13న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

- పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

# ఆర్మూర్ సొసైటీకి తాళం

- ధాన్యం తరలించకపోవడంపై రైతుల నిరసన



**నిజామాబాద్, మే 11 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సొసైటీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో నెలరోజులుగా ధాన్యం కోసి కల్లాల్లో వేసి తూకం చేసిన కూడా లారీల కొరతతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాంపూర్ గ్రామస్తులు ఆర్మూర్ సొసైటీకి సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ నిర్వాహకులు లారీ యజమానులతో కుమ్మక్కై లారీలను తమ గ్రామానికి పంపడం లేదని, మిగతా గ్రామాలకు ప్రతీరోజు ఒకటి, రెండు లారీలను పంపుతూ ధాన్యం సేకరిస్తున్నారని, తమ గ్రామం పై వివక్ష ఎందుకు చూపిస్తున్నారని సొసైటీ చైర్మన్ ని నిలదీశారు. ధాన్యం రోజుల తరబడి కల్లాల్లో ఉండడం వల్ల తరుగు రూపంలో క్వింటానికి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను పంపి కొరతను తీరుస్తానని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి రెండు రోజులలో లారీలను తీసుకొని రాకుంటే ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామస్తులము అందరం కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370